ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 10.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 349 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

స్విస్ ఓపెన్ నుంచి సింధు ఔట్ 10

జనాభా ప్రాతిపదికన పోలీసింగ్

> నేటి పరిస్థితుల్లో నేరాల స్వభావం పూర్తిగా మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరుగుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానంలో సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాల్సిన అవసరం ఉంది. మనం ఎక్కడున్నామో తెలుసుకుంటేనే ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుంది. పోలీసు శాఖలో ఆటో మోడ్ లో పని చేయడం సమాజానికి ప్రమాదకరం. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసి జనాభా ప్రాతిపదికన పోలీసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి.
>
> -సీఎం రేవంత్ రెడ్డి

- పోలీస్ వ్యవస్థను సాంకేతికంగా బలోపేతం చేయాలి
- సైబర్ నేరాల యుగంలో పోలీసింగ్ కూడా మారాలి
- సమస్య గుర్తిస్తే, సగం సమస్య పరిష్కారమైనట్టే
- అభివృద్ధికి శాంతిభద్రతలే పునాది
- పనితీరు ఆధారంగానే పోస్టింగులు
- పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026లో సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 9: మారుతున్న నేర స్వరూపాన్ని ఎదుర్కోవాలంటే పోలీస్ వ్యవస్థను సాంకేతికంగా మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసి జనాభా ప్రాతిపదికన పోలీసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. శాఖలో ఆటో మోడ్ పని చేయడం సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు. అవసరమైన నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజలకు

...:: మిగతా 2లో

అన్ని సౌకర్యాలతో స్పోర్ట్స్ వర్సిటీలు

- క్రీడా శాఖపై అధికారలతో సమీక్ష

హైదరాబాద్‌లో రోడ్లను విస్తరించుకుందాం ...:: 2లో

వెలుగుమట్ల బాధితులకు

ఇండ్లు కట్టేవరకూ పోరాటం

ఖమ్మం జెడ్పీ సెంటర్ దిగ్బంధించిన జాగృతి

- ఈ ప్రభుత్వానికి, నాయకులకు ఆడబిడ్డల ఉసురు తగులుతుంది
- కలెక్టర్ హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తాం
- మహిళా కానిస్టేబుళ్లు లేకుండానే కవిత సహా మహిళ నాయకుల అరెస్ట్
- అరెస్ట్ సందర్భంగా తోపులాట.. పలువురికి గాయాలు
- పోలీసుల తీరుపై జాగృతి నాయకుల తీవ్ర ఆగ్రహం
- పోలీసులపై మహిళ కమిషన్‌కు జాగృతి నేతల ఫిర్యాదు
- వెలుగుమట్ల బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పిన కవిత
- బాధితుల ఇళ్లు కూల్చిన చోటే వారికి కొత్త ఇళ్లు కట్టివ్వాలి
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్/ఖమ్మం ప్రతినిధి, మార్చి 9: ఖమ్మం జిల్లాలోని జెడ్పీ సెంటర్ లో వెలుగుమట్ల బాధితుల పక్షాన ధర్నాకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ సహా జాగృతి నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. మహిళ కానిస్టేబుళ్లు లేకుండానే కల్వకుంట్ల కవిత సహా మహిళ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో పలువురు గాయపడగా, మరికొందరు సొమ్మసిల్లిపడిపోయారు. గాయపడిన వారిని వెంటనే హాస్పిటల్ కు తరలించాలని కవిత డిమాండ్ చేశారు. అరెస్టు సమయంలో నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారు. దీంతో పోలీసుల తీరుపై జాగృతి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళ కానిస్టేబుళ్లు లేకుండా మహిళలను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం

...:: మిగతా 3లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.30 (మంగళవారం సాయంత్రం)

సహర్ – 5.05 (బుధవారం ఉదయం)

అమెరికా, ఇజ్రాయెల్‌తో మోడీ రాజీ

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఎలా రాజీ పడ్డారో బహిర్గతమవుతున్నదని అన్నారు.

9

చీఫ్ ఎలక్షన్ కమిషన్‌పై అభిశంసన!

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తొలగింపునకు పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ తీర్మానానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని, ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశముందని తెలిసింది.

9

రాజ్యసభకు అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి

ఇరువురు నేతల ఎన్నిక ఏకగ్రీవం

- నియామకపత్రం అందుకున్న వేం, సింఘ్వీ
- నమ్మిన వ్యక్తికే సీఎం ఛాన్స్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 9: రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఇరువురు నేతలు నియామకపత్రం అందుకున్నారు. రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలు ఖర్గే, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికి నరేందర్ రెడ్డి ధన్యావాదాలు తెలిపారు. తాను ఎంపీ

...:: మిగతా 2లో

శాసనసభలో ఏ చర్చకైనా సిద్ధం

- కేసీఆర్, బీఆర్ఎస్ సభ్యులందరూ హాజరుకావాలి
- వారు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్తాం
- ప్రజా సమస్యలను పక్కన పెట్టి, సొంత ఎజెండాతో సభకు వస్తున్నారు
- వెలుగుమట్ల నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం
- ఆ క్వారీ నాదని చిల్లర ఆరోపణలు చేస్తున్నారు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 9: శాసనసభలో ఏ చర్చకైనా సిద్ధమని, 16 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్షనేత కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ శాసనసభ్యులందరూ హాజరుకావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రధాన ప్రతిపక్ష సభ్యులు అసెంబ్లీకి హాజరై అడిగే ప్రతి ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సోమవారం సచివాలయంలో తనను కలిసిన విలేఖరులతో మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ శాసనసభ్యులు సభకు వచ్చి తమ వాదనలు వినిపిస్తే, ప్రతి విషయానికి సాక్ష్యాధారాలతో సమాధానం చెప్పడానికి మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు. కానీ, ప్రతిపక్షం ప్రజా సమస్యలను పక్కన పెట్టి, వారి సొంత ఎజెండాతో సభకు వస్తున్నారని అన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలోని ఇండ్ల నిర్వాసితులందరికీ ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, దాని ప్రకారం

...:: మిగతా 2లో

ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

- ఖమేనీ రెండో కుమారుడిని ఎన్నుకున్న 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్'
- ఇరాన్‌దేశవ్యాప్తంగా సంబరాలు
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌దాడులు తీవ్రం
- ఇరాన్ మౌలిక సదుపాయాలపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
- ఇరాన్‌కు మద్దతుగా ఉంటాం: పుతిన్

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

ఇజ్రాయెల్, అమెరికాతో యుద్ధం భీకరంగా సాగుతున్న వేళ ఇరాన్ తన కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. అమెరికా హెచ్చరికలను భేఖాతరు చేస్తూ ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా ఖమేనీని కొత్త నేతగా ప్రకటించింది. మరోవైపు ఇరాన్‌తోపాటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై అమెరికా, ఇరాన్ దాడులు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్‌లోని చమురు నిల్వ కేంద్రాలపై దాడుల కారణంగా వెలువడుతున్న పొగలు పర్యావరణానికి పెనుముప్పు అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఎంపిక కొలిక్కివచ్చింది. ఇరాన్‌లోని 88మంది మతగురువులతో కూడిన 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' కొత్త సుప్రీం లీడర్‌గా ఖమేనీ కుమారుడు

...:: మిగతా 2లో

రైతుల సొమ్ముతో 'రాహుల్ బంధు' పథకం

- ముఖ్యమంత్రి రేవంత్ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు
- ఆరు గ్యారెంటీల అమలుకు అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం ప్రతినిధి

రాజన్న సిరిసిల్ల, మార్చి 9 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రాహుల్ బంధు' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ రాహుల్ బంధు పథకాన్ని రైతులకు ఇచ్చే రైతుబంధు నిధులతో మొదలుపెట్టాడని విమర్శించారు. సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో ఇటీవల గెలుపొందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. సంవత్సరానికి రూ. 1,000 కోట్ల రూపాయలు రాహుల్ గాంధీకి ఇచ్చే రాహుల్ బంధు పథకం మాత్రం తెలంగాణలో పక్కాగా రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి ఎప్పుడు ఇబ్బంది అయినా వేల కోట్ల రూపాయలు పంపించేందుకు సీఎం ప్రయత్నం చేస్తున్నాడని, అందుకే రాహుల్ గాంధీ కోసం బ్రహ్మాండమైన కొత్త పథకాన్ని తెలంగాణలో తీసుకువచ్చారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతన్నలంతా తమకు రైతుబంధు వస్తుందని, కాంగ్రెస్ పార్టీ పెంచి ఇస్తామన్న నిధులను ఇస్తుందని ఎదురు చూస్తూ ఉంటే రేవంత్ రెడ్డి

...:: మిగతా 2లో

సెక్యులరిజానికి కేరాఫ్

కాంగ్రెస్ పార్టీ

- ముస్లింలకు అండగా ఉండేది కాంగ్రెస్సే
- సర్వమతాలను సమానంగా చూస్తాం
- ముస్లింల రక్షణ, సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి
- సూర్యాపేటలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 9: ఢిల్లీ నుండి గల్లీ వరకు ముస్లింలకు అండగా నిలబడేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

...:: మిగతా 3లో

ఎల్పీజీ గ్యాస్ కృత్రిమ కొరత

ఇరాన్‌లో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్) సహా అనేక పట్టణాలు, నగరాల్లోని ఎల్పీజీ ఏజెన్సీల బయట ఒత్తిడి కనిపిస్తున్నది.

9

రాష్ట్రీయం

జనాభా ప్రాతిపదికన పోలీసింగ్

మొదటిపేజీ తరువాయి

మెరుగైన సేవలు అందించేందుకు పోలీసులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026 కార్యక్రమంలో పాల్గొన్న సీఎం మాట్లాడుతూ, నేటి పరిస్థితుల్లో నేరాల స్వభావం పూర్తిగా మారిపోయిందని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ పెరుగుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానంలో సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "మనం ఎక్కడున్నామో తెలుసుకుంటేనే ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుంది" అని సీఎం పేర్కొన్నారు. అందుకే ఈ రిట్రీట్ ద్వారా పోలీస్ శాఖ ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారాలపై విశ్లేషణ జరిగిందని తెలిపారు.

శాంతిభద్రతలే అభివృద్ధికి బలం

ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు పటిష్టంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. పాలసీ పెరాలసిస్ లేకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం "తెలంగాణ రైజింగ్ 2047" పాలసీ డాక్యుమెంట్‌ను రూపొందించామని వెల్లడించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న సుమారు 2100 కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్గా పరిగణిస్తున్నామని వివరించారు. దేశంలోని కొన్ని మెట్రో నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉదాహరణగా ప్రస్తావించిన సీఎం, ఢిల్లీలో కాలుష్యం తీవ్రమైందని, బెంగుళూరులో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. ముంబై, చెన్నై నగరాలు వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గుర్తుచేశారు. అలాంటి నగరాల నుంచి తెలంగాణ ముందుగానే పాఠాలు నేర్చుకోవాలని సూచించారు.

సైబర్ క్రైమ్‌పై ప్రత్యేక దృష్టి

ఒకప్పుడు తీవ్రవాదం పెద్ద సవాలుగా ఉండేదని, దాన్ని ఎదుర్కొనేందుకు ఆక్టోపస్, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. భౌతిక నేరాలను ఎదుర్కొనే వ్యవస్థలు ఉన్నప్పటికీ, ఇప్పుడు సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయని హెచ్చరించారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవడం, ఉన్న సిబ్బందిని అప్‌గ్రేడ్ చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. రిట్రీట్‌లో సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్ తదితర అంశాలపై అధికారులు పలు ప్రతిపాదనలు అందించారని సీఎం తెలిపారు. వాటిని పరిశీలించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కమిటీ విశ్లేషణ అనంతరం అవసరమైన ప్రతిపాదనలను చట్ట రూపంలో తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

అన్ని సౌకర్యాలతో స్పోర్ట్స్ వర్సిటీలు

- జాతీయ స్థాయి క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు
- మూడు స్టేడియాలను ఆధునీకరించాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- క్రీడా శాఖపై అధికారలతో సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 9: అన్ని సౌకర్యాలతో స్పోర్ట్స్ వర్సిటీల నిర్మాణాలు ఉండాలని, గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించిన సీఎం, డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. క్రీడా శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటు, ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వర్సిటీల నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు ఆదేశాలు చేశారు. ఒలింపిక్స్, కామన్‌వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. 3 స్టేడియాలను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునికీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్‌నగర్ స్టేడియాన్ని ఆధునికీకరించాలని, భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునికీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రీడా శాఖ సమీక్షలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, , సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, శాట్ ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, తదతర ఉన్నతాధికారులున్నారు.

శాసనసభలో ఏ చర్చకైనా సిద్ధం

మొదటిపేజీ తరువాయి

త్వరలో అర్హులందరికీ ఇంటి పట్టాతోపాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం ఎప్పుడూ పేదవాడి పక్షానే ఉంటుందని స్పష్టం చేశారు.

ఆ క్వారీ నాదని చిల్లర ఆరోపణలు చేస్తున్నారు

'ఓఆర్ఆర్‌పక్కన సంబంధం లేని క్రషర్ నాదని కొందరు మాట్లాడుతున్నారు. నాపై మాట్లాడేవారిని ఎలా కట్టడి చేయాలో నాకు తెలుసు.. ఆ క్వారీ నాదని చిల్లర ఆరోపణలు చేస్తున్నారు, నాకు క్రషర్ నడిపే ఓపిక లేదు.. అది నా క్రషర్ కాదు.' అని ఘాటుగా మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు చెబుతున్నది తిరుమల క్రషర్, వేస్ట్ క్రష్ చేసి సప్లై చేసే లైసెన్స్ వారికి ఉందని, ఆ క్రషర్ కంపెనీ మా కంటైనర్ తీసుకువెళ్ళిందని, దానిపై ఉన్న పేరును తొలగించినట్లు ఉన్నారు. దానిని పట్టుకుని పిచ్చి వాగుడు వాగుతున్నారని అన్నారు. నా పై పిచ్చి మాటలు మాట్లాడుతున్న వారికి అసెంబ్లీలో గట్టిగా సమాధానం చెబుతాను" అంటూ బీఆర్ఎస్ నాయకుల విమర్శలపై తీవ్రంగా స్పందించారు.

హైదరాబాద్ రోడ్లను విస్తరించుకుందాం

- చెరువులను పునరుద్ధరించుకుందాం
- నాలాల ఆక్రమణలను తొలగించుకుందాం
- పిల్లలకు క్రీడా మైదానాలు కట్టుకుందాం
- మనమెందుకు మూసీని ప్రక్షాళన చేయకూడదు?

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 9: "హైదరాబాద్ నగరంలో రోడ్లను విస్తరించుకుందాం. చెరువులను పునరుద్ధరించుకుందాం. నాలాల ఆక్రమణలను తొలగించుకుందాం. పిల్లలకు క్రీడా మైదానాలు కట్టుకుందాం. అభివృద్ధి చెందుతున్న ఒక మంచి నగరంగా అభివృద్ధి చేసుకుందాం.." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కూకట్‌పల్లిలో హైడ్రా పునరుద్ధరించిన నల్లచెరువును ముఖ్యమంత్రి ప్రారంభించారు. చెరువులో గంగమ్మతల్లికి హారతినిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమ సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. "దేశంలోని మెట్రో నగరాల్లో హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరం. అయితే, ఆక్రమణలు తొలగించి, కాలుష్యం నివారించి మూసీ నదిని పునరుద్ధరించుకోవలసిన అవసరం ఉంది. లేదంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవు. హైడ్రాను ఏర్పాటు చేసినప్పుడు, హైడ్రా పనులు ప్రారంభించినప్పుడు చాలా మంది నాపై విమర్శలు చేశారు. ఇందులో నాకెలాంటి దురుద్దేశం లేదు. నల్లచెరువును పునరుద్ధరించిన తర్వాత వేలాది మంది మొహాల్లో ఆనందం చూసినప్పుడు సంతోషం కలిగింది. పునరుద్ధరించిన చెరువు పార్కుల చుట్టూ వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేద్దాం. స్టాల్స్ పెట్టాలి. పిల్లలు ఆడుకోవడానికి స్థలాల్లేవు. చెరువుల ఒడ్డున ఆటస్థలాలను ఏర్పాటు చేసుకోవాలి. ఈ ప్రాంతంలో ఉన్న చెరువులన్నింటినీ పునరుద్ధరించుకుందాం' అని అన్నారు. 'ఇలాంటి పనులు చేసుకునప్పుడు నిజంగానే కొందరికి నష్టం కలిగి ఉండొచ్చు. పేదవారు ఎవరికీ అన్యాయం చేయను. అలాంటి వారికి డబుల్ బెడ్రూం ఇండ్లను సిద్ధం చేశాం. నిజంగా నష్టం జరిగిన వారికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకుందాం. నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నా. ఈ ప్రాంతాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకోవాలి. ఈ ప్రాంతాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం. అహ్మదాబాద్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్, యూపీలో గంగానది రివర్ ఫ్రంట్ నిర్మించుకుని ఆ నగరాలను అభివృద్ధి చేసుకున్నప్పుడు మనమెందుకు మూసీని ప్రక్షాళన చేయకూడదు" అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, రామచంద్రు నాయక్, ఎమ్మెల్సీ నవీన్ రావుతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతుల సొమ్ముతో 'రాహుల్ బంధు' పథకం

మొదటిపేజీ తరువాయి

రైతుబంధును ఎగ్గొడుతున్నాడని పేర్కొన్నారు. ఇప్పటికే మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టిన ముఖ్యమంత్రి ఈసారి కూడా రైతుబంధును ఎగ్గొట్టాడని మండిపడ్డారు. రైతులకు ఇవ్వాల్సిన రైతుబంధును పక్కన పెట్టి రాహుల్ బంధు పథకం ద్వారా తన సీటును కాపాడుకుంటున్నాడని వెల్లడించారు. రేవంత్ రెడ్డి సామంతు రాజు లెక్క రాహుల్ గాంధీ ఢిల్లీ గద్దెకు కప్పం కడుతున్నారని విమర్శించారు. పేదల భూములు గుంజుకొని, పేదల ఇండ్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ రాహుల్‌కు కప్పం చెల్లిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే హైదరాబాద్ నుంచి మొదలుకొని ఖమ్మం దాకా అన్ని చోట్ల పేదల ఇళ్లను కూలగొట్టి మరి వ్యాపారం చేసి డబ్బులు సంపాదిస్తున్నారన్నారని విమర్శించారు. అందుకే రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను మొదటి క్యాబినెట్ లో నిర్ణయం తీసుకొని చట్టబద్ధత కల్పించి, అమలు చేస్తామని రాహుల్ గాంధీతో సహా అందరూ చెప్పిన మాటలను గుర్తు చేస్తూ తెలంగాణ ప్రజలకు బాకీ పడిన ఆరు గ్యారంటీల చట్టాన్ని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రస్తావిస్తామన్నారు.

ఆరు గ్యారెంటీల అమలుకు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లు

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును తీసుకువచ్చే విధంగా ప్రభుత్వంపైన బిల్లు పెట్టి ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం పైన ఒత్తిడి చేస్తామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుకు ఓటు వేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చి మద్దతు ఇచ్చి రాహుల్ గాంధీతో సహా , పార్టీ నేతలు ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

మొదటిపేజీ తరువాయి

మొజ్తబాను ఎన్నుకుంది. ఇస్లామిక్ రిపబ్లిక్‌లో అత్యంత రహస్య వ్యక్తిగా పేరొందిన మొజ్తబా ఖమేనీ, ఇరాన్ యుద్ధ వ్యూహంలో ఇప్పుడు కీలక పాత్ర పోషించనున్నారు. శక్తిమంతమైన రివల్యూషనరీ గార్డ్స్ ఆయన ఆదేశాల మేరకు పనిచేస్తాయి. మొజ్తబా ఇప్పటివరకు ఎన్నడూ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఏ ప్రభుత్వ పదవినీ చేపట్టలేదు.

దేశవ్యాప్తంగా సంబరాలు

ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీ ఎన్నిక కావడం పట్ల ఆ దేశ వ్యాప్తంగా సంబరాలు చేసుకున్నారు. అనేక మంది మద్దతుదారులు వీధుల్లోకి వచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. 1969లో మషాద్ నగరంలో జన్మించిన మొజ్తబా, చిన్నతనం నుంచే తన తండ్రి షా పాలనను చూస్తూ పెరిగారు. ఇరాన్‌ఇరాక్ యుద్ధంలో రివల్యూషనరీ గార్డ్స్ తరపున పోరాడారు. 1989లో తన తండ్రి అయాతుల్లా ఖమేనీ సుప్రీం లీడర్ అయిన తర్వాత, మొజ్తబా క్రమంగా తన పట్టును పెంచుకున్నారు. 2008 నాటి వికీలీక్స్ పత్రాలు ఆయన్ను తెర వెనుక అసలు అధికారిగా అభివర్ణించాయి. 2005, 2009 ఎన్నికల్లో అహ్మదీ నెజాద్ గెలుపులో మొజ్తబా కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

ఇరాన్‌కు మద్దతుగా ఉంటాం: పుతిన్

ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ఎన్నికైన అయతొల్లా మొజ్తాబా ఖమేనికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభినందనలు తెలిపారు. ఇరాన్‌కు మద్దతుగా ఉంటామని పుతిన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం పుతిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నికైన మొజ్తాబాకు శుభాకాంక్షలు. ఈ క్లిష్ట సమయంలో ఇరాన్‌కు రష్యా అండగా నిలబడుతుంది. ఇరాన్‌లోని మా స్నేహితులకు, వారి సమగ్రతకు రష్యా మద్దతుగా ఉంటుంది. మొజ్తాబా తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇరాన్ ప్రజల్ని ఏకతాటిపైకి తెస్తారని భావిస్తున్నాం. యుద్ధం కొనసాగుతున్న ఈ సమయంలో నాయకత్వం వహించడానికి మొజ్తాబాకు గొప్ప ధైర్యం, పట్టుదల కావాలి" అని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు.

కొనసాగుతున్న దాడులు

ఇరాన్ మౌలిక సదుపాయాలపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

పశ్చిమాసియా యుద్ధం సోమవారం పదోరోజుకు చేరుకున్నది. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు ప్రతిదాడులు కొనసాగాయి. ఇరాన్ లక్ష్యంగా ఇజ్రాయెల్ విస్తృతస్థాయి మిలిటరీ దాడులను చేపట్టింది. టెహ్రాన్, ఇస్ఫహాన్, దక్షిణ ఇరాన్ అంతటా మౌలిక సదుపాయాలపై దాడులు చేపట్టినట్టు ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించింది. ఇరాన్‌లో ఉగ్రవాద పాలనలోని స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్టు ఐడీఎఫ్ తెలిపింది. మరోవైపు గల్ఫ్ దేశాల భూభాగాలపై సోమవారం ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగించింది. ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని ఖతార్ అన్ని పక్షాలను కోరింది. ఇరాన్ దాడుల్లో బహ్రెయిన్ ప్రభుత్వ చమురు సంస్థ 'బాప్కో' రిఫైనరీ మంటల్లో చిక్కుకోవటంతో, అసాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయని.. రోజువారీ ఆపరేషన్ నిలిపివేశామని ప్రకటించింది.

రాజ్యసభకు అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి

ఇరువురు నేతల ఎన్నిక ఏకగ్రీవం

మొదటిపేజీ తరువాయి

కావడానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నేతలందరికీ కృతజ్ఞతలు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తరఫున అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సాయన్న నామినేషన్ వేశారు. నిబంధన ప్రకారం పది మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో స్క్రూటినీ దశలోనే సాయన్న నామినేషన్ తిరస్కరణకు గురైంది. కాంగ్రెస్ తరఫున బరిలో దిగిన ఇద్దరు ఏకగ్రీవం కావడానికి మార్గం మరింత సుగమం అయింది. అభిషేక్ మను సింఘ్వీ దేశంలో అత్యంత సీనియర్ న్యాయవాదుల్లో ఒకరు. ఏఐసీసీ కోటా కింద తెలంగాణ నుంచి మరొకసారి ఆయనకు కాంగ్రెస్ అవకాశం కల్పించింది. వేం నరేందర్ రెడ్డితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో నరేందర్ రెడ్డికి రాజ్యసభ ఎంపీ పదవి రావడానికి ముఖ్యమంత్రే ప్రధాన కారణమని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

నమ్మిన వ్యక్తికే సీఎం ఛాన్స్

వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి దిగే వరకు సీఎం సలహాదారుగా కొనసాగారు. నామినేషన్ నిబంధనల మేరకు ఆయన ముఖ్యమంత్రి సలహాదారు పదవికి రాజీనామా చేసి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో భారీ సంఖ్యలో ఏకంగా 16 మంది ఆశావహులు ఉన్నప్పటికీ వేం నరేందర్‌రెడ్డినే అదృష్టం వరించింది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌లు అంతా ముక్తకంఠంతో మద్దతు పలకడంతో పాటు సీఎం రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించి వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారు అయ్యేట్లు చేశారు.

రేవంత్ రెడ్డికి వెన్నంటే ఉన్న వేం

మొదటి నుంచీ టీడీపీలో ఉన్న వేం నరేందర్ రెడ్డికి రేవంత్ రెడ్డి కూడా ఆ పార్టీలో చేరాక ఆయనతో దగ్గరి సాన్నిహిత్యం ఏర్పడింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే క్రమంలో నరేందర్ రెడ్డి నాటి పీసీసీ అధ్యక్షుడైన రేవంత్ రెడ్డి వెన్నంటే ఉన్నారు. గతంలోనే నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీ చేయాలని సీఎం ప్రయత్నించారని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరిగింది. కానీ నిజానికి కాంగ్రెస్ పార్టీలో పదవులు తక్కువ పోటీ ఎక్కువ. ఎంతంటే ఒక్క రాజ్యసభ సీటుకు ఏకంగా 16 మంది సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోటీ పడ్డారంటే అర్థం చేసుకోవచ్చు.

సింఘ్వీ ఆస్తులు రూ.2,558 కోట్లు -

సుప్రీంకోర్టులో ఆయన ఓ ప్రముఖ న్యాయవాది, మంచి లాయర్ అయితే కోట్లు సంపాదిస్తాడని అంటారు. కానీ అభిషేక్ మను సింఘ్వీ విషయంలో ఇది అక్షరాల నిజం. తెలంగాణ నుంచి రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సింఘ్వీ అఫిడవిట్ చూస్తే ఆ విషయం స్పష్టమవుతుంది. ప్రతి రోజూ 80లక్షల నుంచి కోటి రూపాయలు తన సంపాదనగా ఉన్నట్లు వెల్లడించారు. ఎలాంటి దాపరికం లేకుండా పారదర్శకంగా ప్రతి విషయాన్ని పొందుపరిచిన అభిషేక్ మను సింఘ్వీ తనకు, తన కుటుంబానికి దాదాపు రూ.2558 కోట్లు విలువ చేసే స్థిరచరాస్తులు ఉన్నట్లు నామినేషన్ అఫిడవిట్‌లో వెల్లడించారు. అందులో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు.

ఢిల్లీలో పుట్టి పెరిగిన సింఘ్వీ

ఆయన సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఎకనామిక్స్ ఆనర్స్ విద్యనభ్యసించిన తర్వాత అభిషేక్ మను సింఘ్వీ ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ విద్యను పూర్తి చేసి, 1986లో పీహెచ్‌డీ సాధించారు. అక్కడితో ఆగలేదు. 1987లో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఒక ప్రత్యేక కోర్సును చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలైన కేంబ్రిడ్జ్, హార్వర్డ్ రెండు విశ్వవిద్యాలయాల్లో చదివిన సింఘ్వీ వృత్తిరీత్యా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా స్థిరపడ్డారు. దేశంలో రాజ్యాంగంపై మంచి పట్టున్న, పేరు ప్రఖ్యాతులు కలిగిన న్యాయ నిష్ణాతుల్లో ఆయన ఒకరుగా చెప్పవచ్చు.

నెలకు రూ.30కోట్ల సంపాదన

సింఘ్వీ అఫిడవిట్ పరిశీలిస్తే 2020- 21లో ఆయన ఆదాయం రూ.158 కోట్లు, 2021- 22 ఆర్థిక ఏడాది అది రూ.290 కోట్లకు ఎగిబాకింది. 2022-23లో రూ.359 కోట్లుకు చేరింది. 2023.24లో రూ.333 కోట్లు. 2024.25 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.374 కోట్ల ఆదాయం ఉన్నట్లుగా ఐటీ రిటర్న్‌లో చూపించారు. సగటున ఆయన రాబడిని లెక్క వేస్తే ప్రతి నెలా 25 నుంచి 30 కోట్లు. ప్రతి రోజూ దాదాపు 80 లక్షల నుంచి కోటి రూపాయలు. ఇది ఒక న్యాయవాది సంపాదన.

వ్యవసాయ కుటుంబం నుంచి పెద్దల సభకు



తెలంగాణ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన వేం నరేందర్ రెడ్డి వ్యవసాయ కుటుంబానికి చెందిన నాయకుడు. ఆయన మహబూబాబాద్ జిల్లా కే సముద్రం మండలం అర్పనపల్లి వాసి. అరవై ఏడేళ్ల వయస్సు కలిగిన ఆయనకు రాజకీయాల్లోనూ నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవమూ ఉంది. ఆయన రాజ్యసభ నామినేషన్ వేసిన సమయంలో అఫిడవిట్‌లో తన ఆస్తిపాస్తుల ముఖచిత్రాన్ని సైతం బయట పెట్టారు. వేం నరేంద్ర రెడ్డి తాను వేసిన అఫిడవిట్ లో అయిదేళ్ల కిందట తన వ్యక్తిగత ఆదాయం ఆరు లక్షల ముప్పై వేలు మాత్రమే ఉన్నట్లు చూపించారు. 2024.25 ఆర్థిక ఏడాదికి ఇరవై రెండు లక్షలకు పెరిగింది. ఆయన సతీమణి ఆదాయం పది లక్షలపైన ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ ద్వారా మరో పన్నెండు లక్షలు ఆదాయం ఉన్నట్లు తెలిపారు. అంతా కలిపితే కూడా కుటుంబం మొత్తం వార్షిక ఆదాయం దాదాపు నలభై ఐదు లక్షలుగా పేర్కొన్నారు. స్థిరాస్తుల విషయానికి వస్తే కుటుంబం మరింత బలంగా కనిపిస్తోంది. వేం నరేంద్ర రెడ్డి భార్య పేరున కేసముద్రం వద్ద ఏడున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు దాని విలువ రెండు కోట్లుగా పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ పేర అర్పనపల్లిలో పదిహేను ఎకరాలకుపైన వంశపారం పర్యంగా వచ్చిన పొలాలు ఉన్నట్లు వాటి విలువ మరో మూడున్నర కోట్లు ఉంటుందని వివరించారు. ఇక వరంగల్, హైదరాబాద్ మాధాపూర్, కేసముద్రంలో మూడు వ్యాపార కట్టడాలు ఉండగా వాటి విలువ సుమారు పదిహేడు కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు. నివాస గృహాలు హనుమకొండ, హైదరాబాద్ గచ్చిబౌలి, కే సముద్రంలలో ఉన్నాయని చెప్పారు. వీటన్నింటి విలువతో కలిపి మొత్తం కుటుంబ స్థిరాస్తుల విలువ నలభై కోట్లకు పైగా ఉంటుందని స్పష్టం చేశారు.

జన్ ధన్ యోజనతో సహా 72 కోట్ల బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్స్‌కు కనీస నిల్వ నిబంధన లేదు . వీటికి మినిమం బ్యాలెన్స్ లేకపోయినా ఫైన్ ఉండదని, డిపాజిట్, విత్‌డ్రా, ఏటీఎం సేవలకూ ఛార్జీలు ఉండవు. అందరికీ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ సదుపాయాన్ని కల్పించాం.

-కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

రాష్ట్రీయం

వెలుగుమట్ల బాధితులకు ఇండ్లు కట్టేవరకూ పోరాటం

మహిళల పట్ల అమానుషంగా వ్యవహరిస్తుందని మండి పడ్డారు. నిబంధనలు ఉల్లంఘించిన పోలీసు అధికారుల పై చర్యలు తీసుకోవాలని జాగృతి నాయకులు మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేశారు.

జెడ్పీ సెంటర్ లో ఆందోళన

అంతకుముందు వెలుగుమట్ల బాధితులను కవిత పరామర్శించారు. ఆ తర్వాత వెలుగుమట్ల బాధితులతో కలిసి కలెక్టరేట్ కు ర్యాలీగా వెళ్తూ జెడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. కలెక్టర్ వచ్చి వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో ఇంటి పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఖమ్మం ఆర్ డీవో చర్చలు జరిపినప్పటికీ స్పష్టమైన హామీ రాకపోవటంతో ఆందోళన కొనసాగించారు. దీంతో పోలీసులు ఓవరాక్షన్ కు దిగారు. జాగృతి నాయకులు, వెలుగుమట్ల బాధితులు, ధర్మసమాజ్ పార్టీ నాయకులను దుర్భాషలాడుతూ తోసేశారు. విచక్షణరహితంగా వ్యవహరిస్తూ వారిపై బలప్రయోగం చేసి అదుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వానికి ఉసురు తగులుతుంది

వెలుగుమట్లలో బుల్డోజర్లతో ఇళ్లను నేలమట్టం చేసిన ప్రభుత్వానికి, నాయకులకు బాధిత మహిళల ఉసురు తగులుతుందని కవిత అన్నారు. అంబేద్కర్ భవన్ లో వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన తర్వాత ఆమె మాట్లాడారు. వెలుగుమట్లలో బాధితుల ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందన్నారు. ఎగ్జామ్స్ సయమంలో పుస్తకాలతో సహా రాత్రికి రాత్రే బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేయటం ఆవేదన కలిగించిందన్నారు. బాధితుల ఆవేదన కొంతమంది రాజకీయ నాయకులకు ఎగ్జిబిషన్ మాదిరిగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మీ ఇళ్లను కూల్చేసే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు పాపాలు కడుక్కునే ప్రయత్నంలో బాధితులకు భోజనం పెడుతున్నారన్నారు. తాను ఎక్కడున్న సరే మహిళలు, పేదల పక్షాన ఉంటానని అన్నారు. వెలుగుమట్ల బాధితుల సమస్య పరిష్కారం అయ్యేవరకు వారి పక్షాన పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. విశారదన్ మహారాజ్ గారితో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ, ప్రజా సంఘాలు కూడా బాధితులకు మద్దతుగా ఉన్నారన్నారు. అందరం కలిసి వెలుగుమట్ల బాధితుల సమస్య పరిష్కారమయ్యే వరకు వదలమని చెప్పారు. ముఖ్యమంత్రి సహా జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బాధితుల ఇళ్లు కూల్చిన చోటే వారికి కొత్త ఇళ్లు కట్టించాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేదల మీద జులుం నడుస్తోందని...వారి ఇళ్ల మీదకు బుల్డోజర్లు పంపుతూ అన్యాయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఓ వైపు రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే ఆ రాజ్యాంగాన్ని కూనీ చేసేలా పేదల మీదకు బుల్డోజర్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి చర్యలకు వ్యతిరేకంగా పోరాటం చేద్దామన్నారు.

బాధితులకు ఇళ్లు కట్టేవరకూ పోరాటం: కవిత

బాధితులకు ఇళ్లు కట్టేవరకూ పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు, "వెలుగుమట్ల భూ నిర్వాసితుల ఇళ్ల సమస్య పరిష్కారం వరకు రకరకాల ఆందోళనలను కొనసాగిస్తాం. ఇళ్లు కూల్చిన స్థానాల్లోనే వారికి తిరిగి ఇళ్లు కట్టించాలి. ఇది ప్రభుత్వ భూమి కాదు, భూదాన్ భూమి, పేద ప్రజలకు పంచాల్సిన భూమి అని అన్నారు. ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద జాగృతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ, ధర్మసమాజ్ పార్టీ కలసి వెలుగుమట్ల బాధితుల మద్దతుగా ఆందోళన నిర్వహించారు. కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ, "ఏ పార్టీ, ఏ సంస్థ కూడా చెప్పలేని బలంగా వారి సమస్యను మేము వినిపించాము. ప్రత్యేకంగా వారి ఆకాంక్షలు, సమస్యలను రాష్ట్రస్థాయిలో చర్చించామని నమ్ముతున్నాం. సమస్య పరిష్కారం వరకు పోరాటం కొనసాగుతుంది," అన్నారు. "బాధితుల ఇళ్లు ఎక్కడ కూల్చారో అక్కడే వారికి తిరిగి ఇళ్లు కట్టించాలి. భూదాన్ భూమి పేద ప్రజలకు పంచాల్సిన భూమి, కాబట్టి ఇళ్లు కట్టించే వరకు మా పోరాటం వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉంటుందన్నారు.

నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభం

వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖమ్మం అంబేద్కర్ భవన్‌లో నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. బాధితులతో కలిసి ఆమె ఈ దీక్షలో పాల్గొనడం గమనార్హం. వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కవిత గారు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. దీక్ష ప్రారంభానికి ముందు బాధితులు తమ సమస్యలను వివరించగా, వారికి పూర్తి మద్దతు ఇస్తామని కవిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జాగృతి నాయకులు, స్థానిక కార్యకర్తలు మరియు బాధిత కుటుంబాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని దీక్షలో పాల్గొన్న వారు కోరుతున్నారు.

కల్వకుంట్ల కవిత అరెస్టుపై
మహిళా కమిషన్‌కు జాగృతి మహిళా నేతలు ఫిర్యాదు

ఖమ్మంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను అరెస్టు చేసిన సమయంలో మహిళల అరెస్టుకు సంబంధించిన నిబంధనలు పాటించలేదని ఆరోపిస్తూ మహిళా కమిషన్‌కు జాగృతి మహిళా నేతలు ఫిర్యాదు చేశారు. తెలంగాణ జాగృతి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మీ, హైదరాబాద్ మహిళా విభాగం అధ్యక్షురాలు ధరణి రాణి ఆధ్వర్యంలో మహిళా కమిషన్‌ను కలిసి సంబంధిత పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఖమ్మం జిల్లాలో అరెస్టు సందర్భంగా మహిళలతో పాటు మహిళా నాయకుల పట్ల పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తెలంగాణ జాగృతి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మీ ఆధ్వర్యంలో మహిళా కమిషన్‌ను సంప్రదించి ఈ మేరకు పిర్యాదు సమర్పించారు. మహిళలను అరెస్టు చేసే సమయంలో అనుసరించాల్సిన విధి విధానాలను పోలీసులు పాటించలేదని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా బాధ్యులైన పోలీస్ అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు మహిళా కమిషన్‌ను కోరారు.

రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర నిధులు సాధించాలి

- గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బాట
- బడ్జెట్లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట
- పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క
- బడ్జెట్ ప్రతిపాదనలపై అధికారులతో సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 9: ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను పూర్తి స్థాయిలో తెచ్చుకోవాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడం, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల పాత్రను బలపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, శాఖకు చెందిన అన్ని విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ వినియోగం, వచ్చే ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలపై విస్తృతంగా చర్చించారు. విభాగాల వారీగా అధికారులు బడ్జెట్ ప్రతిపాదనలు మంత్రికి సమర్పించగా, వాటిలో పలు మార్పులు చేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను పూర్తి స్థాయిలో తెచ్చుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక్క రూపాయి కూడా లాప్స్ కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్ణయాల కారణంగా కేంద్ర నిధులు చాలా వరకు పెండింగ్ లో ఉన్నాయని, రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన వాటాను తప్పకుండా సాధించాలని అన్నారు. కేంద్రానికి

రాష్ట్రం భారీగా పన్నులు చెల్లిస్తున్న నేపథ్యంలో, రాష్ట్రానికి రావాల్సిన నిధులను సమర్థంగా సాధించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ప్రతి రూపాయిని జాగ్రత్తగా ఖర్చు చేస్తే అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు ఉండవని తెలిపారు. ముఖ్యంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, అవసరమైన యుటిలిటీ సర్టిఫికేట్లు సమర్పించి వాటిని త్వరగా విడుదల చేయించాలన్నారు.

ఉపాధి కల్పనకు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత

ఉపాధీ హామీ పథకం స్థానంలో కేంద్రం ప్రవేశ పెట్టిన వీబీ జీ రాం జీ చట్టానికి సంబంధించి ఇంకా రూల్స్ ఫ్రేమ్ కాలేదని పేర్కొన్న మంత్రి సీతక్క, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన కోసం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శాఖలోని అన్ని విభాగాలు తమ ప్రగతి నివేదికలను క్రమం తప్పకుండా రూపొందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. జల సంరక్షణ కార్యక్రమాల్లో రాష్ట్రానికి ఉత్తమ రాష్ట్రంగా అవార్డులు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, అదే విధంగా అన్ని విభాగాలు మెరుగైన పనితీరు కనబరచాలని అన్నారు. 99 డేస్ ప్రణాళికల్లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నంబర్ వన్ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. జిల్లాల వారీగా నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నాటికి ఈ భవనాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆదివాసీ, ఏజెన్సీ మరియు గిరిజన ప్రాంతాల్లో అనేక వాగులు ఉన్నప్పటికీ వేసవికాలంలో సాగు మరియు తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. వర్షాకాలంలో వరదలు, వేసవిలో నీటి ఎద్దడి సమస్యలు ఎదురవుతున్నందున వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా వాగులు, వంకలు, తోగులపై చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు.

ఇండస్ట్రీలకు అనుగుణంగా నైపుణ్యాలు

- యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం
- 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఆధునిక కోర్సులు
- రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 9: యువతకు ఆధునిక నైపుణ్యాలు పెంచి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లో నూతన స్వల్పకాలిక కోర్సులను రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎన్‌సీ మెషిన్ ఆపరేషన్, రోబోటిక్స్, ఈవీ టెక్నాలజీ, 2డీ, 3డీ ప్రొడక్ట్ డిజైనింగ్ వంటి ఆధునిక కోర్సులను ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. ఈ ప్రణాళికలో తీసుకున్న నిర్ణయాలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన యువత అందుబాటులో లేరని అనేక పరిశ్రమలు చెబుతున్నాయని, అందుకే ఇండస్ట్రీలకు అవసరమైన స్కిల్ సెట్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఏటీసీలు, ఐటీఐలు భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన శిక్షణ పొందిన నిపుణులను తయారు చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన కోర్సులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రపంచంతో పోలిస్తే వ్యవసాయ రంగంలో మన ఉత్పాదకత తక్కువగా ఉన్నందున అగ్రి అలైడ్ సెక్టార్‌లో నైపుణ్యాలను పెంచే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జీనోమ్ వ్యాలీ ప్రాంతంలోని పరిశ్రమల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అక్కడి పరిశ్రమలకు అవసరమైన కోర్సులను కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. అదే విధంగా టామ్‌కామ్ ద్వారా విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా శిక్షణ అందిస్తున్నామని, విదేశాల్లో మెరుగైన వేతనాలతో మంచి అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఏటీసీల నుంచి ఇప్పటికే పలువురు విద్యార్థులు ఉద్యోగాల్లో చేరుతున్నారని, భవిష్యత్తులో జిల్లాల వారీగా జాబ్ మేళాలు కూడా నిర్వహించనున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఉపాధి మరియు శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, అధికారులు, ట్రైనర్లు పాల్గొన్నారు. ఏటీసీ మరియు ఐటీఐ విద్యార్థులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు.

సెక్యులరిజానికి కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ

మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. దేశంలో సర్వమతాలను సమానంగా చూస్తూ, వారి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న పార్టీ కుడా కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని ఆయన స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో సెక్యులరిజానికి పెద్ద పీట వేస్తున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమే నన్నారు. లోకసభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ మొదలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని ఆయన చెప్పారు. ఒక్క మాటలో చెప్పాలి అంటే సెక్యులరిజానికి కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ చిరునామాగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. ముస్లింల రక్షణతో పాటు వారి వారి అభివృద్ధితో పాటు సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు పెద్ద పీట వేశాయని ఆయన గుర్తుచేశారు. ముస్లింలు పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొనడడం ఆనంద దాయకంగా ఉందన్నారు. సూర్యాపేట లో ముస్లింల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా మంత్రిగా నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలో షాదీఖాన, కమ్యూనిటి హాల్, ఖబ్రస్తాన్ వంటి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేత సర్వోత్తం రెడ్డి,జిల్లా కాంగ్రెస్ అద్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మోరిశెట్టి నివేదితా లక్షాది, పీసీసీ కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రాలో సింథటిక్ డ్రగ్స్‌తయారీ

- డ్రగ్స్‌దందాను ఛేదించిన తెలంగాణ ఈగల్‌టీం
- షాద్ నగర్‌కేంద్రంగా డ్రగ్స్‌తయారీకి యత్నం
- సాధ్యపడకపోవడంతో ఆగ్రాకు మకాం
- రాజస్థాన్‌లో ఇద్దరు, ఆగ్రా జిల్లాలో ఒకరి అరెస్టు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 9: సింథటిక్ మాదకద్రవ్యాలు(డ్రగ్స్) తయారుచేసి పలు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న ముఠా కోసం తెలంగాణ ఈగల్ టీం భారీ ఆపరేషన్‌ఆగ్రాలో చేపట్టింది. హైదరాబాద్ నగరంలో ముడిసరుకు కొనుగోలు చేసి ఆగ్రాలో మెఫిడ్రిన్ అనే మత్తుపదార్థాన్ని తయారు చేస్తున్న ముఠా గుట్టును రట్టుచేశారు. ఈగల్‌టీం ఇచ్చిన సమాచారంతో రాజస్థాన్‌లో పోలీసులు ఇద్దరు నిందితులను, ఖండౌలీ పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా నిందితులు గతంలో అధ్యాపకులుగా పనిచేసినట్లుగా పోలీసుల విచారణలో గుర్తించారు. తెలంగాణ ఈగల్ టీం పోలీసులు ఇచ్చిన సమాచారంతో మత్తుదార్థాల తయారీకి ఉపయోగించిన 886లీటర్ల ముడి పదార్థాలు, వస్తువులను ఖండౌలీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను ఈగల్ పోలీసులు తెలిపారు. యూపీలోని ఆగ్రా జిల్లా ఖండౌలీకి చెందిన మనోజ్‌కుమార్ 2025 వరకు అధ్యాపకుడిగా పనిచేశాడు. జోధ్‌పూర్‌లో జూనియర్ లెక్చరర్‌గా పనిచేసే సమయంలో సహోద్యోగైన వీరేంద్రస్వామితో పరిచయం పెరిగింది. గత మార్చిలో జాబ్ ను వదిలేసిన మనోజ్‌కు వీరేంద్రస్వామి కాల్‌చేసి ఎండీఎంఏ మాదకద్రవ్యాన్ని తయారుచేద్దామని, తనకు సహకరిస్తే భారీగా డబ్బు సంపాదించొచ్చని ఆశచూపించాడు. మనోజ్ కుమార్ అంగీకరించడంతో ఇద్దరూ గతేడాది హైదరాబాద్ నగరానికి వచ్చారు. షాద్‌నగర్‌లోని నేషనల్ హైవే సమీపంలో ఓ రూం అద్దెకు తీసుకున్నారు. 15 రకాల ముడిపదార్థాలను సేకరించి నెలపాటు డ్రగ్‌ను తయారు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదు. దీంతో మనోజ్ రాజస్థాన్‌కు వెళ్లిపోయి ఓ స్కూల్‌లో టీచర్‌గా చేరాడు. వీరేంద్రస్వామి అతడి స్నేహితుడు మనీశ్ మనోజ్‌తో మళ్లీ సంప్రదించాడు. ఖండౌలీలోని రామ్‌నగర్‌లో ముగ్గురూ కలిసి ముడిపదార్థాలతో డ్రగ్స్‌తయారీని ప్రారంభించారు. ఈ మెఫిడ్రిన్ రాజస్థాన్ నుంచి పలు రాష్ట్రాలకు చేరుతున్నట్లుగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న తెలంగాణ ఈగల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌రెడ్డి టీం రెండ్రోజుల క్రితం ఖండౌలి జిల్లాకు బయలుదేరి వెళ్లింది. స్థానిక పోలీసుల సాయంతో మనోజ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఈగల్ బృందం సీక్రెట్ ఆపరేషన్

ఆగ్రాలో మత్తుపదార్థాల తయారీ వెనుక గుట్టు కనిపెట్టడానికి తెలంగాణ ఈగల్ బృందం కొన్నివారాల పాటు రహస్యంగా పనిచేసింది. కూకట్‌పల్లిలోని ఓ కంపెనీ నుంచి కొంతమంది ముడి సరుకును భారీగా కొనుగోలు చేయడంపై అనుమానం వ్యక్తం చేసింది. సంబంధిత కంపెనీ యజమానిని సంప్రదించి కొనుగోలు చేస్తున్న వారి వివరాల గురించి ఆరా తీశారు. గిరీశ్‌థాపర్ పేరుతో గత సెప్టెంబరులో వందల కిలోల ముడిసరకు ఆర్డర్ చేసినట్లు అతడు వివరించాడు. మొత్తం మూడు సార్లు మనీశ్, గిరీశ్ దిల్లీ, గుజరాత్‌లలో కచ్, కర్ణాటకలో చిత్రదుర్గ్ జిల్లా తదితర ప్రాంతాలకు 300 కిలోల ముడిసరకును డెలివరీ తీసుకున్నారు. ఈ వ్యవహారంపై అనుమానం కలిగిన పోలీసులు దర్యాప్తు చేయగా ఖండౌలీలో మనోజ్‌తో డ్రగ్స్ తయారు చేయించిన వీరేంద్రస్వామి గిరిశ్ థాపర్ ఒక్కరేనని అని విచారణలో తేలింది. గిరీశ్, మనీశ్, శిశుపాల్, సుమీత్ ఈ మత్తుపదార్థాల తయారు చేస్తుండగా రాజస్థాన్ జోధ్‌పూర్‌కు చెందిన రాజు వీరికి ఆదేశాలిస్తున్నట్లుగా విచారణలో తేలింది.

నకిలీ అడ్రస్, పేర్లతో దందా

ఇదిలా ఉండగా ముఠా సభ్యులు నకిలీ అడ్రస్, పేర్లతో ఈ దందాకు పాల్పడుతున్నట్లుగా వెల్లడైంది. మనీశ్ గతంలో మెదక్ జిల్లాలోని చేగుంటలోని వల్లూరులో జోధ్‌పూర్ దాబా నడిపినట్లు వీరేంద్ర, శిశుపాల్, రాజు హైదరాబాద్ నగరానికి వచ్చినప్పుడు ఇక్కడే ఉండేవారని విచారణలో తేలింది. వీరేంద్రస్వామి గురించి ఆరా తీసిన ఈగల్ టీం పోలీసులు రాజస్థాన్ కోట జిల్లాలోని హనుమాన్‌గఢ్ ప్రాంతానికి చెందిన వాడిగా గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారమివ్వగా వీరేంద్ర, మనీశ్‌లను పోలీసులు అరెస్టు చేశారు

ఇరాన్‌పై యుద్ధం దాదాపుగా పూర్తయింది. యుద్ధం ముగిసేందుకు 4-5 వారాల సమయం పడుతుందని అంచనా వేయగా, అంతకంటే ముందే పూర్తి కాబోతోంది. ఇరాన్‌కు ఇప్పుడు నేవీ, కమ్యూనికేషన్స్, ఎయిర్ ఫోర్స్ ఏవీ లేవు.

-అమెరికా అధ్యక్షుడు
డొనాల్డ్ ట్రంప్

ఓపెన్ వాయిస్

తమిళనాట విజయ్ 'ఉచిత' హామీలు

తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తన తమిళగ వెట్రి కళగం పార్టీ ద్వారా ప్రకటిస్తున్న ఉచితాల వరద ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి స్టాలిన్ అమలు చేస్తున్న పథకాలకు రెట్టింపు ప్రయోజనాలు కల్పిస్తామన్న ఆయన హామీలు అటు ఆకర్షణీయంగా కనిపిస్తున్నా, ఇటు విమర్శలకు పదును పెడుతున్నాయి. విజయ్ అనుసరిస్తున్న ఈ వ్యూహం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. ఒకవైపు ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నా, మరోవైపు ఆయన రాజకీయ పరిణతిని ఇది ప్రశ్నార్థకం చేస్తోంది.కనీసం వార్డు మెంబర్‌గా కూడా అనుభవం లేని విజయ్, నేరుగా ముఖ్యమంత్రి పీఠంపై కన్నేసి ఇలాంటి భారీ హామీలు ఇవ్వడంపై మేధావి వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనా అనుభవం సున్నా అయిన వ్యక్తి, రాష్ట్ర ఖజానాపై పడే వేల కోట్ల భారాన్ని ఎలా మేనేజ్ చేస్తారనేది ప్రధాన ప్రశ్న. స్టాలిన్ ప్రభుత్వం ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు కష్టపడుతుంటే, విజయ్ అంతకు రెట్టింపు ఇస్తాననడం అసాధ్యమైన హామీ గా ప్రజలు భావించే ప్రమాదం ఉంది. ఇది ఆయనను ఒక 'సీరియస్ పొలిటీషియన్ గా కాకుండా, కేవలం ఓట్ల కోసం ఆశ చూపే సినిమా గ్లామర్ నేతగా ముద్ర వేసే అవకాశం ఉంది.విజయ్ పార్టీపై యువతలో ఉన్న ప్రధాన ఆశ మార్పు . దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల మధ్య నలిగిపోతున్న తమిళనాట ఒక కొత్త రాజకీయ సంస్కృతి వస్తుందని ఆశించిన వారికి, ఈ ఉచితాల ప్రకటనలు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి. ఇతర రాజకీయ నాయకులలాగే విజయ్ కూడా ఉచితాలనే నమ్ముకోవడం వల్ల, ఆయన ప్రత్యేకత ఏముందనే ప్రశ్న తలెత్తుతోంది. మార్పు కోరుకునే ఓటర్లు కేవలం డబ్బు లేదా వస్తువుల కోసం ఓటు వేయరు. వారు వ్యవస్థాగత మార్పును కోరుకుంటారు. ఈ క్రమంలో విజయ్ తనకున్న యూత్ ఐకాన్ ఇమేజ్‌ను కోల్పోయి, పాతతరం రాజకీయాలనే పునరావృతం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.అధికారమే పరమావధిగా ఆయన దేనికైనా తెగిస్తున్నారనే సంకేతాలు వెళ్తున్నాయి. కేవలం గెలవడమే లక్ష్యంగా ఇలాంటి హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నిధులు లేవు అనే సాకుతో చేతులెత్తేస్తారేమో అన్న భయం సామాన్యుల్లో కలగడం సహజం. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి బలమైన క్యాడర్ ఉన్న పార్టీలను ఢీకొట్టాలంటే ఈ మాత్రం షో ఉండాలని విజయ్ వర్గం వాదిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఆయన మాటల్లోని నిజాయితీని ఎంతవరకు నమ్ముతారన్నదే ఇక్కడ అసలు పాయింట్. తమిళ రాజకీయాల్లో ఉచితాలు అనేవి గెలుపు గుర్రాలుగా మారిన చరిత్ర ఉంది. అందుకే ఏ చిన్న అవకాశాన్ని వదిలిపెట్టకూడదనే పట్టుదలతో ఆయన పథకాల వరద పారిస్తున్నారు. అయితే, సినిమా స్క్రిప్ట్ లాగా హామీలు ఇవ్వడం సులభం కానీ, బడ్జెట్ అంకెలను సరితూచడం కష్టమనే నిజాన్ని ఆయన త్వరలోనే గ్రహించాల్సి ఉంటుంది. తమిళనాడు రాజకీయాల్లో అధికారంలో వాటా ఇస్తామంటూ సరికొత్త ప్రకటనతో సంచలనం సృష్టించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. డీఎంకే వంటి బలమైన పార్టీని ఎదుర్కోవడానికి ఇతర పార్టీలతో కూటమి కట్టాలని ఆయన చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. తన మొదటి బహిరంగ సభలోనే మిత్రపక్షాలకు రెడ్ కార్పెట్ పరిచిన విజయ్ ఆఫర్‌పై తొలత కాంగ్రెస్, వీసీకే వంటి పార్టీలు ఆసక్తి చూపినప్పటికీ అవేవీ డీఎంకే కూటమిని వీడలేదు. ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యూహాత్మకంగా వ్యవహరించి తన మిత్రపక్షాలకు సీట్ల సర్దుబాటులో కొంత వెసులుబాటు కల్పించి వారు బయటకు వెళ్లకుండా కట్టడి చేయడంలో విజయం సాధించారు. దీంతో ప్రస్తుతం విజయ్ రాజకీయ క్షేత్రంలో ఒంటరి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ డీఎంకే లేదా అన్నాడీఎంకే కూటముల్లో స్థిరపడటంతో టీవీకే భవిష్యత్తుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పన్రుట్టి రామచంద్రన్ వంటి కొద్దిమంది మద్దతు తప్ప విజయ్‌కు బలమైన రాజకీయ అండ లభించలేదు. యువత , తొలిసారి ఓటు వేసే వారిపైనే ఆయన కొండంత ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు విజయ్ వ్యక్తిగత జీవితం చుట్టూ ముసురుతున్న వివాదాలు కూడా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా కనిపిస్తున్నాయి. ఆయన భార్య సంగీత విడాకుల పిటిషన్ దాఖలు చేయడం , అందులో పేర్కొన్న అంశాలను ప్రత్యర్థి పార్టీలు ఇప్పటికే అస్త్రాలుగా మలుచుకుంటున్నాయి. ఎన్నికల సమయంలో ఈ వ్యక్తిగత ఆరోపణలు ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
10.03.2026

సవాళ్ల కడలిలో ఉప్పొంగిన విజయనాదం

తీవ్రమైన ఒత్తిడిని జయించి, విమర్శకుల నోళ్లు మూయిస్తూ వారు సగర్వంగా ట్రోఫీని ఎత్తిపట్టిన క్షణం కోట్లాది మంది క్రీడాభిమానుల హృదయాలను ఉప్పొంగేలా చేసింది. ఆ క్షణంలో మైదానంలో చిందిన వారి ఆనంద భాష్పాలు, వారు పడిన మానసిక క్షోభను, వారు సాధించిన అపురూప విజయాన్ని ఏకకాలంలో ఆవిష్కరించాయి. ఈ విజయం ఏ ఒక్కరి వ్యక్తిగత ప్రతిభకూ దక్కిన నిదర్శనం కాదు; అది ఒక సామూహిక సంకల్పానికి, నిరాశను ఎదిరించిన ధిక్కార స్వరానికి సజీవ ప్రతీక. మాకు దశాబ్దాల అనుభవం లేకపోవచ్చు, కానీ ఎవరికీ తీసిపోని అంతులేని ఆత్మవిశ్వాసం, గెలవాలన్న కసి ఉన్నాయి అని ఈ కుర్రాళ్ల సమూహం యావత్ ప్రపంచానికి గట్టిగా చాటిచెప్పింది. ట్రోఫీని చేతబూనిన ఆ చారిత్రక క్షణం, అప్పటివరకూ వారిపై కురిసిన విమర్శల రాళ్లనే పునాది రాళ్లుగా మార్చుకుని వారు నిర్మించిన విజయ సౌధానికి ప్రతీకగా నిలిచింది.

జనక మోహన రావు దుంగ
8247045230

క్రీడా చరిత్ర పుటలలో కొన్ని విజయాలు కేవలం కప్పుల సాధనకో, రికార్డుల నమోదుకో పరిమితం కావు. అవి ఒక జాతి క్రీడా స్ఫూర్తిని, యువతరం అచంచలమైన పట్టుదలను యావత్ ప్రపంచానికి చాటిచెబుతాయి. 2026 ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత క్రికెట్ జట్టు సాధించిన అద్వితీయ విజయం అటువంటి కోవకే చెందుతుంది. ఇది కేవలం ఒక క్రీడా సంబరం కాదు. అకుంఠిత దీక్షకు, అచంచలమైన విశ్వాసానికి దక్కిన సజీవ సాక్ష్యం. ఎన్నో అంచనాలు, మరెన్నో సందేహాల నడుమ, ఒకరకంగా చెప్పాలంటే అత్యంత ప్రతికూల వాతావరణంలో బరిలోకి దిగిన భారత జట్టు, విశ్వవిజేతగా ఆవిర్భవించిన తీరు క్రీడా చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా మిగిలిపోతుంది. ఇది కేవలం ప్రత్యర్థిపై మైదానంలో సాధించిన భౌతికమైన గెలుపు మాత్రమే కాదు. తమను వేలెత్తి చూపిన విమర్శకులపై ప్రదర్శించిన ఒక నిశ్శబ్ద, శక్తివంతమైన నైతిక ఆధిపత్యం. కోట్లాది మంది అభిమానుల భయాలను పటాపంచలు చేస్తూ, విశ్వవేదికపై భారత పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించిన ఈ అపురూప ఘట్టం సదా స్మరణీయం.

తరం మారిన వేళ - ఒక క్లిష్ట పరిస్థితి:

ఒక మహత్తర శకానికి ముగింపు పలికి, నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టడం... ఏ క్రీడా జట్టుకైనా కత్తిమీద సామే! మునుపటి ప్రపంచకప్ విజయాల అనంతరం సీనియర్ దిగ్గజాల నిష్క్రమణతో భారత టీ20 జట్టు భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని క్రీడా పండితులు విశ్లేషించారు. ఒక తరం ఆటగాళ్లు ఆటను వీడినప్పుడు సహజంగానే ఏర్పడే ఖాళీని భర్తీ చేయడం ఆషామాషీ వ్యవహారం కాదు. జట్టులోని ఈ మార్పుల దశలో, యువ క్రీడాకారులతో కూడిన సరికొత్త జట్టుకు ప్రాణం పోయడం భారత క్రీడా నియంత్రణ మండలికి, యాజమాన్యానికి ఒక అతిపెద్ద సవాలుగా పరిణమించింది. జట్టులో అనుభవలేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నా, కేవలం ప్రతిభే గీటురాయిగా కుర్రాళ్లకు పెద్దపీట వేస్తూ జట్టులో తీసుకువచ్చిన సమూల మార్పులు సత్ఫలితాలను ఇస్తాయా అన్నది అప్పట్లో ఒక పెద్ద ప్రశ్నార్థకంగా మిగిలింది. దశాబ్దాలుగా జట్టు భారాన్ని మోసిన మహావృక్షాలు నిష్క్రమించిన వేళ, లేత మొక్కలు ఆ మహా భారాన్ని మోయగలవా అన్న సందేహం సర్వత్రా అలుముకుంది.

జట్టు కూర్పుపై రేగిన వివాదాల జడివాన:

ఈ నవతరం జట్టు కూర్పుపై రేగిన విమర్శల జడివాన అంతాఇంతా కాదు. ఎంపిక కమిటీ నిర్ణయాలను, యాజమాన్యపు వ్యూహాలను తప్పుబడుతూ క్రీడా విశ్లేషకులు, మాజీ ఆటగాళ్లు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థిరమైన, దశాబ్దాల అనుభవం ఉన్న ఆటగాళ్లను పక్కనపెట్టి, కేవలం దేశవాళీ పోటీల్లో రాణించిన యువకులకు జాతీయ జట్టులో అవకాశాలు కల్పించడం ఆత్మహత్యా సదృశమేనని పలువురు బహిరంగంగానే పెదవి విరిచారు. అంతర్జాతీయ వేదికపై, అదీ ప్రపంచకప్ లాంటి మహాసమరంలో ఒత్తిడిని తట్టుకునే మానసిక పరిపక్వత ఈ జట్టుకు లేదని

దేశవ్యాప్తంగా అపారమైన సందేహాలు వ్యక్తమయ్యాయి. ప్రతి ఎంపికా ఒక వివాదంగా, ప్రతి నిర్ణయమూ విమర్శలకు కేంద్రబిందువుగా మారి జట్టుపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని పెంచాయి. వీరు కేవలం కుర్రాళ్లు.. అంతర్జాతీయ స్థాయి ఒత్తిడికి కుప్పకూలడం ఖాయం! టోర్నీకి ముందు జట్టు చుట్టూ అలుముకున్న నైరాశ్య వాతావరణం ఇది.

ప్రతికూలతల అగ్నిపరీక్షలో రాటుదేలిన యువతరం:

విమర్శల అగ్నిపరీక్షే ఈ యువ జట్టులో కసిని రగిలించే ప్రధాన ఇంధనంగా మారింది. సవాళ్ల కొలిమిలో కాలిన ఇనుమే తిరుగులేని ఉక్కుగా మారుతుందన్న సత్యాన్ని ఈ భారత జట్టు ప్రపంచానికి నిరూపించింది. మైదానంలోకి అడుగుపెట్టిన క్షణం నుండి, తమపై వస్తున్న ప్రతికూల వ్యాఖ్యలను, అవహేళనలను పూర్తిగా పక్కనపెట్టి, కేవలం లక్ష్యంపైనే దృష్టి సారించారు. జట్టుగా వారు ఎదుర్కొన్న అపహాస్యం వారిలో దృఢమైన పట్టుదలను రగిలించింది. ఎవరైతే వీరి సామర్థ్యాన్ని శంకించారో, వారే ఈ యువ కెరటాల అద్భుతమైన పోరాట పటిమకు విస్మయం చెందేలా చేశారు. విమర్శకులు ఎత్తిచూపిన అనుభవలేమిని, తమ అపరిమితమైన శక్తిసామర్థ్యాలతో, భయంలేని క్రీడాశైలితో భర్తీ చేశారు.

భయం ఎరుగని సరికొత్త క్రీడా శైలి:

ఈ జట్టు ప్రదర్శించిన అత్యంత అద్భుతమైన లక్షణం వారిలోని నిర్భయత్వం. ఓడిపోతామనే భయాన్ని పక్కనపెట్టి, గెలవాలనే కసితో వారు మైదానంలోకి అడుగుపెట్టారు. క్రికెట్ వ్యాకరణాన్ని మార్చివేస్తూ, సంప్రదాయబద్ధమైన రక్షణాత్మక ఆటతీరుకు స్వస్తి పలికి, అడుగడుగునా ఆధిపత్యాన్ని చెలాయించే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా, తమ సహజశైలిని మార్చుకోకుండా ఎదురుదాడి చేయడమే ప్రధాన ఆయుధంగా మలచుకున్నారు. ఈ భయంలేని క్రీడాశైలి ప్రత్యర్థి జట్లను సైతం మానసికంగా కుంగదీసింది.

ఒత్తిడిని జయించిన సమిష్టి పోరాట పటిమ:

టోర్నమెంట్ ఆసాంతం ఈ యువ జట్టు ప్రయాణం పూలపాన్పులా ఏమీ సాగలేదు. ఎన్నో క్లిష్ట పరిస్థితులు, చేజారిపోతున్నాయనుకున్న మ్యాచ్‌లు, అనుభవజ్ఞులైన ప్రత్యర్థులు విసిరిన వ్యూహాత్మక వలయాలు వీటన్నింటినీ ఈ జట్టు తమ అద్భుతమైన సమిష్టి కృషితో ఛేదించింది. ఒకరు విఫలమైతే మరొకరు బాధ్యత తీసుకోవడం, ప్రతికూల పరిస్థితుల్లో అనూహ్యమైన ఆటతీరుతో విరుచుకుపడటం ఈ జట్టు విజయ రహస్యంగా మారింది. మైదానంలో వారు కనబరిచిన అద్భుతమైన దేహదారుఢ్యం, పాదరసం లాంటి చురుకైన ఫీల్డింగ్, ఎన్నటికీ ఓటమిని అంగీకరించని మొండి నైజం యావత్ క్రీడాలోకాన్ని అబ్బురపరిచాయి. ఏ దశలోనూ వారిలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లలేదు. ప్రత్యర్థి ఎంతటి బలశాలి అయినా సరే, కళ్లోకి కళ్లు పెట్టి చూస్తూ ఎదురొడ్డి పోరాడిన తీరు భారత క్రీడా చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.

విజయ శిఖరాగ్రాన సగర్వంగా నిలిచిన క్షణం:

తుదిపోరులో వారు ప్రదర్శించిన ఆటతీరు ఒక వీరోచిత కావ్యంలా సాగింది. తీవ్రమైన ఒత్తిడిని జయించి, విమర్శకుల నోళ్లు మూయిస్తూ వారు సగర్వంగా ట్రోఫీని ఎత్తిపట్టిన క్షణం కోట్లాది మంది క్రీడాభిమానుల హృదయాలను ఉప్పొంగేలా చేసింది. ఆ క్షణంలో మైదానంలో చిందిన వారి ఆనంద భాష్పాలు, వారు పడిన మానసిక క్షోభను, వారు సాధించిన అపురూప విజయాన్ని ఏకకాలంలో ఆవిష్కరించాయి.

భవిష్యత్తుకు మార్గదర్శనం - ఒక ఉజ్వల ముగింపు:

విమర్శలను పట్టించుకోకుండా లక్ష్యం వైపు నిశ్చలమైన చిత్తంతో అడుగులేస్తే, అసాధ్యాలను సైతం సుసాధ్యం చేయవచ్చని ఈ విజయం భావితరాలకు ఒక ఉజ్వలమైన స్ఫూర్తిని రగిలిస్తోంది. ఒక తరం ముగిసిన వెంటనే మరో తరం అంతే బలంగా, అంతకంటే దీమాగా ఉద్భవించగలదని, సరైన అవకాశాలు ఇస్తే ప్రతిభావంతులైన యువత అద్భుతాలు సృష్టిస్తుందని ఈ ప్రపంచకప్ యాజమాన్యాలకు ఒకగొప్ప పాఠం నేర్పింది. అనుభవం కంటే ఆత్మవిశ్వాసం ఎప్పుడూ బలమైన ఆయుధమని వీరు నిరూపించారు. ఇది భారత క్రికెట్ చరిత్రలో కేవలం ఒక కప్ గెలుపు మాత్రమే కాదు, రాబోయే దశాబ్ద కాలం పాటు ప్రపంచ క్రికెట్ సామ్రాజ్యాన్ని శాసించబోయే ఒక నూతన, తిరుగులేని క్రీడా శకానికి గర్వకారణమైన నాంది.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

ఉద్యమశీలి సావిత్రి బాయి పూలే..!

డాక్టర్ సంగని మల్లేశ్వర్,
9866255355

సావిత్రిబాయి ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు...,స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి.. స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకి, గొప్ప రచయిత్రి. స్త్రీపురుషులు కులమతాలకతీతంగా విద్యనభ్యసించడం సహజమైన హక్కు ఉంటుందని, అందుకే అందరూ చదవాలి... అందరూ సమానంగా బ్రతకాలి... అని అనునిత్యం తపించిన సామాజిక విప్లవ మాతృమూర్తి సావిత్రిబాయి. నాటి, నేటి సమాజంలో సావిత్రిబాయి ప్రాముఖ్యత గొప్పది.మన దేశంలో ఆడపిల్లల చదువు, వారి అభ్యున్నతి గురించి మాట్లాడుకోవాలంటే ముందు గాగుర్తుకు వచ్చేది సావిత్రిబాయి పూలే కృషేనని చెప్పవచ్చు. మహిళల అభివృద్ధికి పాటు పడిన మొట్ట మొదటి బహుజన మహిళ ఆమె. భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు. మహారాష్ట్ర, సతారా జిల్లాలోని నయాగావ్ గ్రామంలో 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా నమ్‌గావ్ లో సావిత్రిబాయి జన్మించింది. 1847 నాటికి భర్తతో కలిసి బాలికలకోసం పూనేలో మొదటి పాఠశాల ప్రారంభించారు.ఈ పాఠశాల నడపటం కొందరికి నచ్చలేదు. దీంతో సావిత్రీ బాయిపై వేధింపులకు, భౌతికదాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచేదారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్లు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు.బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా 'నా విధిని నేను నిర్వహిస్తున్నాను' అని చెప్పేది. పట్టు వీడక వారు సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ కాలంలోనే సహకారం గుర్తింపు లభించాయి.సావిత్రి బాయి పూలే గొప్ప కవి, రచయిత్రి, చక్కటి ఆలోచనలు, త్యాగం, సేవ, నిబద్ధత కలిగిన మహిళ. 1854లో కావ్యపూలే అనే ఒక కవితా సంపుటి రచించారు. అభంగ్ అనే రచన ఆనాటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టేలా ఉండేది. సూటిగా, సరళంగా ప్రకృతి వర్ణన జానపద కళలు, ప్రతిబింబించే కావ్య రచనలు చేశారామె. 1891లో ప్యావ్నాశీ సుభోధ్ రత్నాకర్ 11 పేరిట కవితా సంపుటిని ప్రచురించారు. క్రాంతి బాయిగా ప్రజలందరూ పిలుచుకునే సావిత్రీబాయి పూలే ఆధునిక భారతదేశ చరిత్రలో ధృవతారగా వెలుగొందుతూనే ఉంది. నిరక్షరాస్య అమాయక బాల్యంలో జీవిస్తున్న ఆమెకు 9వ యేటనే 12 సంవత్సరాల జ్యోతిరావు పూలేతో వివాహం జరిగింది. సావిత్రిబాయి, భర్త ప్రోత్సాహంతో ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలై, అనంతరం బాలికా విద్య ఉద్యమానికి పునాది వేశారు. విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మిన సావిత్రిబాయి 1848లో భర్తతో కలిసి బాలికల కోసం పుణెలో మొట్ట మొదటి పాఠశాలను నెలకొల్పి,

చదువు చెప్పటం ప్రారంభించారు. మహిళా హక్కులే మానవ హక్కులని నినదించి అనేక సామాజిక సమస్యలపై కూడా అలుపెరుగని పోరాటం చేశారు. స్త్రీలను చైతన్యపరచడానికి 1852లోనే మహిళాసేవ మండల్ పేరిట మహిళా సంఘాన్ని స్థాపించారు. వితంతువుల పట్ల వివక్ష, అక్రమ సంతానం పేరిట శిశువుల హత్యలకు వ్యతిరేకంగా వివిధ పోరాటాలు నడిపారు. అనాధ బాలలు, బాలికలు అందరూ తమ బిడ్డలేనని భావించారు. అనాథ స్త్రీలకు, పిల్లలకు శరణాలయాలు, ఆశ్రమాలు ఏర్పాటు చేయించింది. సత్యశోధక సమాజంలో మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసి కులాంతర వితంతు వివాహాలు జరిపించింది. 1874లో ఒక వితంతువు బిడ్డను పూలే దంపతులు దత్తపుత్రుడిగా స్వీకరించారు. ఆ బిడ్డకు యశ్వంత్ అనే పేరుపెట్టి పెద్దవాడిని చేసి డాక్టర్ను చేశారు.1873లోనే సత్యశోధక్ సమాజం మహిళా విభాగం పేరిట కులాంతర వివాహాలు అనేకం జరిపించారు. భార్యను కోల్పోయిన ఒక యువకుడికి తన స్నేహితురాలి బిడ్డతో పెండ్లి చేశారు సావిత్రిబాయి భర్తతోపాటు తాను కూడా అన్ని కష్టాల్ని అవమానాల్ని సహించింది. సావిత్రీబాయి ప్రపంచచరిత్రలోనే భర్తతోపాటు ఉద్యమ జీవితంలో కలిని నడిచిన ఆదర్శ సహచరిగా ఆమె నిలిచిపోయింది. సావిత్రిబాయి తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి విద్యాబోధనకు, బాలికలకు అంకిత మైంది. సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం పెద్దలతో ఘర్షణ పడవలసివచ్చినా బెదరలేదు.1890లో భర్త జ్యోతిరావు పూలే మరణిస్తే అంత్యక్రియలు జరిపే సందర్భంలో బంధువులు, దత్తపుత్రులు ఘర్షణ పడుతుంటే మరణంతో అంతులేని దుఃఖ సాగరంలో ఉండి కూడా ఆయన చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. 1897లో ప్లేగు వ్యాధి ప్రబలిస్తుంటే సావిత్రిబాయి పూలే కొడుకుతో కలిసి వ్యాధిగ్రస్తులకు సేవలందించారు . ఆ సమయంలో 'ప్లేగు వ్యాధి పిల్లల శిబిరాన్ని' సైతం ఏర్పాటు చేశారు. పుణె నగరాన్ని అతలాకుతలం చేసిన తీవ్ర కరువులో ప్లేగు వ్యాధి గ్రస్తులకు సావిత్రిబాయి అసమాన సేవలు అందించారు.చివరకు అదే ప్లేగు వ్యాధి బారిన పడి సావిత్రిబాయి 1897 సంవత్సరం మార్చి 10న చనిపోయారు. వ్యక్తిత్వంతో సమకాలీన సమాజాన్ని ప్రభావితం చేసి, ప్రేమ, అంకితభావం, కర్తవ్య దీక్షలతో ప్రజల మనసును గెలుచుకున్న ఆమె, తన సామాజిక లక్ష్యసాధన కోసం జీవితాంతం నడిచింది. అణగారిన, దళితుల, స్త్రీల అభ్యున్నతి కోసం కృషి చేసి తన జీవితాన్ని తర్వాత తరాలకు ఆదర్శంగా నిలిచింది.1997లో భారత ప్రభుత్వం ఆమె జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసింది.పూణే విశ్వవిద్యాలయానికి ఆమె పేటు పెట్టి గౌరవించారు. తన వ్యక్తిత్వంతో సమకాలీన సమాజాన్ని ప్రభావితం చేసి,ప్రేమ,అంకితభావం,కర్తవ్య దీక్షలతో ప్రజల మనస్సును గెలిచినా ఆమె,తన సామాజిక లక్ష్యసాధన కోసం జీవితాంతం నడిచింది. అణగారిన,బలహీన, దళిత స్త్రీల అభ్యున్నతి కోసం కృషి చేసి తన జీవితాన్ని తర్వాత తరాలకు ఆదర్శంగా నిలిచిన చదువులతల్లి సావిత్రిబాయి పూలే జయంతి రోజు మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రేవంత్ ప్రభుత్వం ప్రకటించి,గౌరవించడమే తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే ఘనమైన నివాళి.

(సావిత్రి బాబు పూలే 129 వర్ధంతి సందర్భంగా)

(వ్యాసకర్త జర్నలిజం విభాగాధిపతి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్)

విజ్ఞాన వెలుగుల విప్లవ జ్యోతి

సంపతి రమేష్
7989579428

భారతీయ సామాజిక వ్యవస్థలో శతాబ్దాలుగా దళిత ,బహుజనులతో పాటు మహిళలు విముక్తికి దూరమైనారు. చారిత్రకంగా శూద్ర మహిళలు కుల వ్యవస్థతో విద్యకు నోచుకోలేదు. విద్యపై, ఆస్తిపై హక్కులేకపోవడం, బాల్య వివాహం, సతీ వంటి క్రూరాచారం, విధవరాలైతే కఠినమైన జీవితం వంటి చాందస భావాలు అగ్రకుల మహిళల పాలిట శాపంగా మారాయి. ఇవన్నీ భారతీయ మహిళల చరిత్రలో ముద్రపడ్డ చేదు వాస్తవాలు. అయితే ఈ కారు చీకట్ల నుంచి సమాజ మార్పు కోసం బయలుదేరిన ఆదర్శ దంపతులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే. సావిత్రిబాయి పూలే మహిళా విముక్తి దీప్తిగా చరిత్రలో నిలిచింది. 19వ శతాబ్దపు అడ్డుగోడలను ఛేదించి తన భర్త జ్యోతిరావు పూలేకు తోడుగా నిలిచింది. "నా ధర్మాన్ని నేను నెరవేరుస్తానని" మహిళలకు విముక్తి కల్పించిన సామాజిక చైతన్య దీప్తి. ఈ మాతృమూర్తి మహారాష్ట్రలోని సతారా జిల్లాలోని నాయాగవ్ గ్రామంలో 1831 జనవరి 3న ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించినది. భర్త ప్రోత్సాహంతో ఇంట్లోనే విద్యావంతురాలై, అహ్మద్ నగర్ లోని ఉపాధ్యాయ శిక్షణ పొందినది. అనంతరం ఆమె విద్య ఉద్యమానికి పునాది వేసింది. 1848లో పూలే బాలికల కోసం పూణేలో మొట్ట మొదటి పాఠశాలను ప్రారంభించారు. బాలికలకు విద్య బోధించడానికి వెళ్లే సమయంలో అగ్రకులాలు ఆమెపై రాళ్లు, చెత్త, పశువుల పేడ నీళ్ళు చల్లి తీవ్ర అవమానాలు చేసేవారు. అయినా సమాజంలో వెలుగులను నింపింది. సావిత్రిబాయి పూలే ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త, మహిళల హక్కుల కోసం కృషి చేసిన తొలి మహిళా విప్లవకారిణిగా నిలిచింది. మరి పూలే దంపతులు ఎదుర్కొన్న అవమానాలు, త్యాగాలు, కష్టాలు ఈ తరం మహిళలకు ఎంతవరకు తెలిసినాయి? అనేది ప్రశ్నార్థకమే. సావిత్రిబాయి పూలే అక్షర ఉద్యమాన్ని ముందుకు నడిపించడానికి ఆమె జయంతి రోజున రెండేళ్ల క్రితం తెలంగాణలో ధర్మ టీచర్ యూనియన్ ఏర్పడింది. విద్యను ప్రజాస్వామీకరించాలని యుద్ధం చేస్తున్నది. ఆమె జయంతినీ తెలంగాణ ప్రభుత్వం మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకొంటున్నారు.

అణగారిన వర్గాల మహిళలకు అవకాశాలు అందినప్పుడే?

భారతదేశంలో చారిత్రకంగా కులవ్యవస్థ, సంప్రదాయాలు, పితృస్వామ్య ఆచారాల కారణంగా అణచివేయబడ్డ మహిళల సాధికారతకు కృషి వేసిన మొట్టమొదటి సారధులు పూలే దంపతులు, అంబేద్కర్. వారి కృషి వల్లనే ఈ రోజు అన్ని వర్గాల మహిళలు ఉపాధ్యాయురాలు కావడం, వైద్యురాలు కావడం, శాస్త్రవేత్త కావడం,



రాజకీయ నాయకురాలు అవుతున్నారు. కానీ రాజ్యాంగం ద్వారా మహిళలకు జరుగుతున్న లబ్ధి అసమానంగానే ఉంది. అగ్రవర్ణ మహిళలు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవకాశాలను పొందుతున్నప్పటికీ...దళిత, బహుజన, ఆదివాసీ మహిళలు ఇంకా అనేక రకాల వేధింపులకు, దాడులకు, హింసకు బలవుతున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో నాగర్ కర్నూలు జిల్లాలోని బీసీ చాకలి కుటుంబంపై అగ్రకుల దాడిలో ఒక పాప మరణం ఇందుకు నిదర్శనం. ఈ కుల ఆధిపత్యంపై డాక్టర్ విశారదన్ మహారాజ్ పోరాటం పలువురిని ఆలోచింపచేసింది. కులం, వర్గం, ఆర్థిక స్థితి, ప్రాంతం వంటి అంశాలు మహిళల అవకాశాల నిర్ణయిస్తున్నాయి. మహిళల విముక్తి కేవలం లింగ సమానత్వంతోనే సాధ్యం కాదని, కుల ఆధిపత్యాన్ని కూడా ప్రశ్నించాల్సిందేనని స్పష్టమవుతుంది. అప్పుడే విద్య ,ఉపాధి, సంపద రాజకీయాల్లో మహిళలకు సమాన అవకాశాల లభిస్తాయి. ఇదే చదువుల తల్లి సావిత్రి బాయి పూలేకు ఘననివాళి.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917
ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు

చురుగ్గా నిర్వహించాలి

● **జిల్లా కలెక్టర్ కే. హైమావతి**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 09 : సిద్దిపేట జిల్లాలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం 99 రోజులు చురుగ్గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి ముందు జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో ప్రభావవంతంగా అమలు చేయాలని ఆమె తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ శాఖల వారీగా నిర్దేశించిన కార్యక్రమాలను గ్రామాల వరకు ప్రతిరోజు నిర్వహించి, వాటి వివరాలను ఫోటోలతో సహా ఆన్లైన్‌లో పొందుపరచాలని సూచించారు.ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల పరిష్కార కార్యక్రమాలను అన్ని శాఖలలో నిర్వహించి కార్యాలయాలను శుభ్రంగా ఉంచడంతో పాటు పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలని చెప్పారు. మున్సిపాలిటీలు, గ్రామాలలో వీధుల పరిశుభ్రత కార్యక్రమాలను పగడ్బందీగా చేపట్టాలని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు మరియు ఇతర విద్యాసంస్థల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జిల్లాలోని వాహనాల డ్రైవర్లకు వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందించాలని రవాణా శాఖకు సూచించారు. రెసిడెన్షియల్ విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. గ్రామాలు మరియు మున్సిపాలిటీలలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ స్తంభాలు మరియు వైర్లను సరిచేయాలని చెప్పారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు.14 నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు సిద్దిపేట గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రితో పాటు జిల్లాలోని అన్ని సీహెచ్సీలలో హెచ్పీవీ వ్యాక్సినేషన్ నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 12న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై మున్సిపల్ కమిషనర్లు, వార్డు కౌన్సిలర్లు మరియు సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) అబ్దుల్ హమీద్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు

ప్రతిపక్షం,మెదక్ టౌన్,మార్చ్ 09: మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంట గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు నుజ్జత్ సుల్తానా గ్రామ పంచాయతీ సెక్రటరీపై సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నాగేష్‌కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఇల్లు నిర్మాణానికి అనుమతి కోసం పంచాయతీ సెక్రటరీ తన వద్ద నుంచి రూ.15,000 లంచం తీసుకున్నారని తెలిపారు.అలాగే ప్రస్తుతం ఇల్లు పేరు మార్పిడి కోసం రూ.5,200 లంచం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. ఈసారి అయినా పంచాయతీ సెక్రటరీపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డు సభ్యురాలినే లంచం అడుగుతుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలి అని ఆమె ప్రశ్నించారు.ఈ విషయంపై స్పందించిన అధికారులు డీపీఓను కలిసి పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

బీడీ కమిషన్ దారుల కమిషన్ పెంచాలి

హెచ్ఎంఎస్ రాష్ట్ర బీడీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఇదారి మల్లేశం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట మార్చి 09: బీడీ కమిషన్ దారుల ప్రస్తుత అగ్రిమెంట్ ఈ నెల 31తో ముగుస్తున్న నేపథ్యంలో కొత్త అగ్రిమెంట్‌ను వెంటనే అమలు చేసి, ప్రస్తుతం ఉన్న కమిషన్ రేటుపై 60 శాతం పెంపు చేయాలని హెచ్ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర బీడీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఇదారి మల్లేశం డిమాండ్ చేశారు. నిజామాబాద్ పట్టణంలో సోమవారం హెచ్ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బీడీ మెన్యుఫ్యాక్చర్ అండ్ టొబాకో అసోసియేషన్ బీడీ కంపెనీ మేనేజర్ మనోజ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు ఇదారి మల్లేశం మాట్లాడుతూ... బీడీ కమిషన్ దారుల ప్రస్తుత అగ్రిమెంట్ 31 మార్చి 2026తో ముగుస్తున్న నేపథ్యంలో కొత్త అగ్రిమెంట్‌ను త్వరితగతిన చేయాలని కోరారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కమిషన్ రేటుపై 60 శాతం పెంపు చేసి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మానవతా దృక్పథంతో కమిషన్ దారులందరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, బీడీ యజమాన్యం కమిషన్ దారులపై ఒత్తిడిని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంపల్లి సత్యనారాయణ, కార్యదర్శి ఇదారి లక్ష్మణ్, కోశాధికారి సందిరి శ్రీనివాస్ రెడ్డి, కానుగంటి రమేష్, జిల్లా నాయకులు కన్న శ్రీశైలం, రాజమౌళి, లక్ష్మీనరసు, ప్రకాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సమాజ ప్రగతికి పునాది

● **అదనపు ఎస్పీ మహేందర్**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 09 : మహిళా సాధికారతే సమాజ ప్రగతికి పునాది అని జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా పోలీస్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి వారిని శలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ దేశ అభివృద్ధిలో ముఖ్యమైన భాగస్వాములుగా నిలుస్తున్నారని అన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ప్రతిభ చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది ధైర్యం,నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు సేవలు అందిస్తున్నారని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, ఆర్ఐ శైలేందర్, సీఐలు సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, డీపీవో సిబ్బంది, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రమ్మ మరణం బాధాకరం

ప్రతిపక్షం,తొగుట, మార్చ్ 9: మండలంలోని వెంకట్రావుపేట కు చెందిన కొక్కొండ లక్ష్మీనారాయణ సతీమణి వజ్రమ్మ (80) అకాల మరణం బాధాకరమని మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ తో కలిసి ఆమె భౌతిక కాయనికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తనవంతుగా రూ. 3000వేల ఆర్థిక సహాయం అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో ఉప సర్పంచ్ లచోళ్ల లింగం, వార్డు సభ్యులు మిద్దె శ్రీనివాస్, నాయకులు సుతారి రాములు, కోక్కొండ సురేష్, ఈడుగళ్ల పర్శరాములు, సింగోజీ కృష్ణ, పాత్కుల బాలయ్య, లింగంపేట లింగం, బెజ్జనమైన సందీప్, బెజ్జనమైన నవీన్, పిట్ల రాములు, రేపాక నాగయ్య, వడ్ల రాజేందర్ తదితరులు ఉన్నారు.

ప్రార్థనల కోసం ఈద్గా మైదాన్ శుభ్రం చేయాలి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 9 : రంజాన్ పండుగ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ఈద్గా మైదాన్‌ను శుభ్రపరచి అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని తంజీమ్ ఉల్ మసాజిద్ తరఫున ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఉబైద్ ఉర్ రెహ్మాన్ మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ను కోరారు. రంజాన్ ఈద్‌కు ముందు ఈద్గా మైదాన్‌ను పూర్తిగా శుభ్రపరచి చెత్త, అవాంఛిత మొక్కలను తొలగించాలని, పరిశుభ్రత కోసం క్రిమినాశక మందులు పిచికారీ చేయాలని ఆయన సూచించారు. భక్తులు సులభంగా కూర్చునే విధంగా నేలను సమతలంగా చేయడం, ప్రార్థనల అనంతరం శుభ్రపరిచే పనుల కోసం పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా ఈద్గా మైదాన్‌లో ఈద్ ప్రార్థనలు నిర్వహించడానికి గుడారం, ధ్వని విస్తరణ ఏర్పాట్లు చేయాలని కూడా కోరారు. ఈ ఏర్పాట్లన్నీ వీలైనంత త్వరగా చేపట్టాలని మున్సిపల్ అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఖాజా అజీముద్దీన్, షేక్ అబూద్, మొహమ్మద్ దర్వేష్ మొహియుద్దీన్, మొహమ్మద్ హుసామా, షేక్ షర్జిల్, మొహమ్మద్ నజీర్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

● **మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్**

ప్రతి పక్షం, దుబ్బాక, మార్చి 09 : దుబ్బాక మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడం తో పాటు, ప్రధాన సమస్యలను పరిష్కరించి, మున్సిపాలిటీ అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు దుబ్బాక మున్సిపాలిటీ కమిషనర్ కళ్యాణం.రమేష్ కుమార్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం దుబ్బాక మున్సిపాలిటీ కార్యాలయం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం నుండి స్థానిక బస్టాండ్, గాంధీ రోడ్డు, అంబేద్కర్ చౌరస్తా, శాస్త్రి విగ్రహం మీదుగా అంగడి బజార్ వరకు వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులతో 5కే రన్ పోటీని నిర్వహించి, అంగడి బజార్లో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో చేపడుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులతో పాటు సమస్యల పరిష్కారానికి , మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు పాలకవర్గం సభ్యులతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. పట్టణ ప్రజలకు తడి, పొడి, హానికర చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ పై రానున్న రోజుల్లో ప్రతి వార్డులో ప్రజలందరికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన పాలకవర్గం సహాయంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధిలోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్లు దేవుని రాజు, చాంద్ మియా, తునికి సురేష్, మెరుపుల సాయి కుమార్ గౌడ్, గంభీర్ పూర్ కనకరాజు, వనం రమేష్, నాయకులు అనంతుల శ్రీనివాస్,శెట్టి చిన్న దేవరాజ్, బండి రాజు, కోటగళ్ల రాజేష్, మున్సిపల్ సిబ్బంది, పాఠశాల, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెగా రైతు మేళాకు తరలిన రైతులు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 9 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులోని రాజేంద్ర నగర్ లో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళాకు సోమవారం సిద్దిపేట జిల్లా పట్టు రైతులు తరలి వెళ్లారు. పట్టు పరిశ్రమ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి నేతృత్వంలో మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు. పట్టు పరిశ్రమ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ పట్టు సాగులో తీసుకోవాల్సిన మెలకువలను, పట్టు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలను, ప్రోత్సాహకా లను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారులు ఐలయ్య, మల్లేశం, సిద్దిపేట జిల్లా పట్టు రైతుల సంఘం గౌరవ అధ్యక్షులు పెద్దోళ్ల నర్సింలు, జిల్లా అధ్యక్షులు పెద్దోళ్ల ఐలయ్య, రైతులు పిల్లి శీను, బొగ్గుల నరసింహులు, బి.సంతోష్, పి.శ్రీను, బి.ఎల్లం, బి.మహేష్, రంగదాస్, డి.రాకేష్, దినేష్, శ్రీకాంత్, రవి, పద్మా రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, నీలం రెడ్డి, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

20 సార్లు రక్తదానం చేసిన రాజారెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 9 : రక్తదానం ప్రాణదానంతో సమానమని సిద్దిపేట మున్సిపాలిటీ నర్సాపూర్ 2 వ వార్డుకు చెందిన యువ నాయకుడు రాజారెడ్డి అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మైసంపల్లికి చెందిన గందమళ్ళ కొమురయ్య బి పాజిటివ్ బ్లడ్ అవసరం అయింది. విషయం తెలుసుకున్న రాజారెడ్డి బ్లడ్ దానం చేయడం జరిగింది. దీంతో చికిత్స పొందుతున్న వ్యక్తి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు ఇది 20వ సారి బ్లడ్ డొనేట్ చేయడం విశేషం. ఎవరికైనా బ్లడ్ అవసరమని తెలిసిన వెంటనే స్పందించి, రక్తదానం చేస్తూ, అలాగే సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్న యువ నాయకుడు ఎర్రబోలు రాజారెడ్డి ని పలువురు అభినందిస్తున్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ సాధించాలి

● **రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య**

ప్రతి పక్షం, దౌల్తాబాద్, మార్చి 9 : విద్యార్థులు త్వరలో జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలకు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, విద్యార్థులకు సూచించారు. సోమవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహంలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమాజానికి ఉపయోగపడే విధంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతి గృహ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. గ్రామ సర్పంచ్ అనురాధ, ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ మాట్లాడుతూ.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదో తరగతి పూర్తి చేసుకుని ఉన్నత విద్యలో మరింత రాణించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేసి తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ గఫూర్,చంద్రశేఖర్, ఎంఈఓ కనకరాజు,హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రమణారెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం అనిల్ కుమార్, రిటైర్డ్ డిపిఓ అమీద్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ రహీమోద్దీన్, వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్చి 17న సిద్దిపేటలో ఎడ్యుకేషన్ ఫెయిర్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, మార్చ్ 09 : తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో మార్చి 17న సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు తెలంగాణ విద్యా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెండెం తారక్ గౌడ్ తెలిపారు. సిద్దిపేటలోని మెట్రో గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి విజయేంద్ర రెడ్డి కలిసి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు ఎలాంటి కోర్సులు ఎంచుకోవాలన్న విషయంలో చాలా సందేహాలు ఉంటాయని తెలిపారు. ఆ సందేహాలను నివృత్తి చేయడానికి ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ యూనివర్సిటీలు పాల్గొంటాయని తెలిపారు. విద్యార్థులు తమకు ఉన్న అనుమానాలను నిపుణులతో చర్చించి తమ బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు. ఇలాంటి అద్భుతమైన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, ఎడ్యుకేషన్ కౌన్సిలర్ రామిని మధు తదితరులు పాల్గొన్నారు.

“

బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయేకు తమిళనాడులో ఎంట్రీ లేదు. ‘తమిళనాడుకు ఏమీ ఇవ్వకూడదనుకునే వారికి ప్రజలు ఎలా ఓట్లు వేస్తారు? అయినా ఓట్లు అడిగేందుకు వాళ్లెలా వస్తారు? ఈ ఎన్నికలు తమిళనాడు-ఎన్డీయే మధ్య, డీఎంకే టీమ్‌కు-ఢిల్లీ టీమ్‌కు మధ్యే జరుగుతున్నాయి. ఏఐడీఎంకేను మింగేయాలని బీజేపీ చూస్తోంది. ఆ పార్టీని చూస్తే జాలి కలుగుతోంది. బీజేపీ దగ్గర తాకట్టు పెట్టారు.

- తమిళనాడు సీఎం స్టాలిన్

ప్రాంతీయం

రైతు యాప్‌లో వివరాలను నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 09: రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే పంట వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ అధికారులకు సూచించారు.మే 10 వ తేదీ లోపు అన్ని పంటల నమోదుకు చివరి తేదన్నారు.కొల్చారం మండలం అప్పాజీ పల్లి లో పంట నమోదు యాప్ పని తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పంట పొలాలకు వెళ్లి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటల నమోదుకు వ్యవసాయ శాఖ గ్రామ స్థాయిలో ప్రయివేట్ సర్వేయర్ల ద్వారా డిజిటల్ పంట సర్వే కి శ్రీకారం చుట్టింది. జియోరిఫరెన్స్ చేయబడిన కాడాస్ట్రల్ మ్యాప్లు వున్న గ్రామాలలో ప్రయివేట్ సెర్వేయేర్లూ కేంద్ర ప్రభుత్వం యాప్ లో పంట నమోదు చేస్తారు. కాడాస్ట్రల్ మ్యాప్ అందుబాటులో లేని గ్రామాలలో మండల వ్యవసాయ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ యాప్) లో పంట నమోదు చేస్తారు అన్నారు. ప్రతి రైతు పొలం వద్దకు (వాలంటీర్) అధికారి ప్రత్యక్షంగా వెళ్లి ఫోటోలు తీసి అక్కడ నుంచే ఆన్లైన్లో నమోదు అప్లోడ్ చేసేందుకు క్రాప్ బుకింగ్ పేరుతో మొబైల్ యాప్ తీసుకువచ్చిందన్నారు పంట నమోదు వివరాలను మొబైల్ యాప్ ద్వారా పక్కాగా నమోదు చేయాలని సూచించారు. రైతులు ఏపంట వేశారు? వాటికి ఏమైనా తెగుళ్లున్నాయా? అనేది గుర్తించి తీసిన ఫొటోను అక్కణ్నుంచే యాప్లో అప్లోడ్ చేస్తున్నట్లు వివరించారు.. జియో ట్యాగింగ్ ద్వారా ఆ సర్వే నంబరు పొలం నుంచే అప్లోడ్ చేశారా? లేదా అనేది వ్యవసాయశాఖ గుర్తిస్తుందని చెప్పారు. జిల్లాలో 2,85,774 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 39827 ఎకరాలు నమోదు చేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యత అవసరం పెరుగుతుంది

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 9 : ప్రపంచం ఒక కుగ్రామంగా మారి అంతరిక్ష యుగంలోకి దూసుకెళ్లి కంప్యూటర్లకు ప్రాధాన్యత పెరిగిందని మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్ అన్నారు. ఈ తరుణంలో ప్రతి ఒక్కరికీ డిజిటల్ అక్షరాస్యత అవసరమని చెప్పారు. ముస్కాన్ డ్రీమ్స్ క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హేకథాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాల విద్యార్థులతో వివిధ రకాల ప్రాజెక్టులను తయారు చేయించారు. ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అని చెప్పారు. ప్రతి రంగంలో కంప్యూటర్ ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) యుగం ప్రస్తుతం నడుస్తున్నదని అన్నారు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంప్యూటర్ నిత్యావసరంగా మారిందని చెప్పారు. విద్యార్థులను డిజిటల్ అక్షరాస్యులుగా కార్యక్రమంలో భాగంగా హేకథాన్ పాల్గొన్న విద్యార్థులకు 21 శతాబ్దపు నైపుణ్యాలు నేర్పించామని అన్నారు. దీని వల్ల విద్యార్థులకు క్రిటికల్ థింకింగ్(తార్కిక విశ్లేషణ లేదా విమర్శనాత్మక ఆలోచన), సమస్యల సాధన(ప్రాబ్లెమ్ సాల్వింగ్), సృజనాత్మక ఆలోచన(క్రియేటివ్ థింకింగ్), నూతన ఆలోచన(ఇన్నోవేటివ్ ఐడియా)లు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ ఈవెంట్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కత్తుల లక్ష్మారెడ్డి, జీడిపల్లి సురేందర్ రెడ్డి, దుద్దెడ పరశు రాములు, భైరు సత్తయ్య, ధీకొండ గోవర్ధన్, ఆదిరాల సాయినాథ శర్మ, ముస్లి రాజయ్య , తడకంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యావర్ధిని విద్యార్థిని ప్రతిభ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 9: హైదరాబాద్‌లో నిర్వహించిన అబాకస్ జాతీయ స్థాయి పోటీలలో స్టార్ జూనియర్ లెవల్-1 విభాగంలో విద్యవర్ధిని ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, మంగమ్మ తోట, సిద్దిపేటకు చెందిన ఫస్ట్ క్లాస్ విద్యార్థిని జి. సాన్వి ఉత్తమ ప్రతిభ కనబరిచి 2025-26 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయిలో రెండవ బహుమతి, నగదు బహుమతిని గెలుచుకుంది.ఈ సందర్భంగా విద్యార్థిని జి. సాన్విని స్కూల్ యాజమాన్యం, ప్రధానోపాధ్యాయుడు బి. మోహన్ కుమార్ అభినందించారు. అలాగే శిక్షకులు శామీమ్ మేడం, భార్గవి మేడం కూడా సాన్వి ప్రతిభను కొనియాడుతూ అభినందనలు తెలియజేశారు.

ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చ్ 9 : ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అర్హత మేరకు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.అలాగే జిల్లాలోని అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 80 వినతులను స్వీకరించారు. గత వారం ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి అధికారులు తీసుకున్న చర్యలపై శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు.స్వీకరించిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.అనంతరం ప్రజావాణి అర్జీలు మరియు అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పథకాల అమలుపై స్పష్టమైన నివేదికలు అందజేయాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.శాఖల వారీగా పనితీరు మరింత మెరుగుపడేలా పటిష్ఠ కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో పన్నులు పెంచొద్దు

- కౌన్సిల్ పట్టణ అభివృద్ధికి పాటుపడాలి
- వేసవికాలంలో తాగునీటి ఎద్దడిని నివారిద్దాం
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 09: మెదక్ పట్టణము ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుంది కావున అభివృద్ధి చెందుతున్న పట్టణ దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ టాక్స్‌లు పెంచరాదని ప్రజలను ఇబ్బందికి గురి చేయవద్దని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు సోమవారం మెదక్ మున్సిపల్ మొదటి సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులు ఎమ్మెల్యే తో పాటు ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఈ కార్యక్రమానికి విచ్చేశారు ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ వారికి స్వాగతం పలికారు పూల మొక్కలు విచ్చి స్వాగతం పలికారు అనంతరం కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యేను ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్. మెదక్ పట్టణ అభివృద్ధికి సుమారు 200 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన మున్సిపల్ కౌన్సిలర్లను కోరారు మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లకు అవగాహన సదస్సు నిర్వహించాలని ప్రతి ఒక్కరూ వార్డులో సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించే దిశగా ముందుకెళ్లాలని ఆయన సూచించారు. పట్టణంలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు ముఖ్యంగా నీటి సమస్య పరిష్కారానికి ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నీటి సమస్యకు ఎదుర్కోరాదని అవసరమనుకుంటే మైనంపల్లి సేవా సంస్థ ద్వారా బోరు బావులను తవ్వించి ప్రజలకు మంచినీటి సౌకర్యం అందేలా చూస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రతి కౌన్సిలర్ వార్డులలో ప్రతి సమస్యపై అవగాహన పెంచేందుకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు కేంద్ర ప్రభుత్వ నిధుల నుండి మెదక్ మున్సిపాలిటీకి అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు ప్రజల సమస్యలను పరిష్కరించడమే ఏకైక దేంగా ప్రతి కౌన్సిలర్ పనిచేయాలని ముఖ్యంగా అంగన్వాడి భవనాలు లేకపోవడం జరిగిందని వెంటనే నూతన భవనాలకు చూడాలని ఆయన పిలుపునిచ్చారు మరి ముఖ్యంగా వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మంచినీటి పరిష్కారం కోసం ఒక ప్రణాళిక రూపొందించుకోవాలని అవసరమా అనుకుంటే అద్దెకు మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలుపుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు వార్డులలో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పొడి చెత్త తడి చెత్తను వేరుచేసి మున్సిపల్ కార్మికులకు అందజేయాలని ప్లాస్టిక్ నిషేధ అమలు చేయడం కోసం ప్రజలు తమకు సహకరించాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం రాజకీయాల కచ్చితంగా పనిచేయాల్సిన అవసరం ఉంటుందని కౌన్సిలర్లు ఒక తాటిపైకి వచ్చి మెదక్ అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు తనకు ఈ అవకాశం కల్పించిన మైనంపల్లి రోహిత్ మైనంపల్లి హనుమంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ బట్టి ఉదయ్. దీపక్. జుబేర్. వెంకటరమణ. శివరామకృష్ణ. పల్లె రాణి.లక్ష్మి స్వరాగిణి. గోదాల మానస. సరూప తదితరులు మాట్లాడుతూ వచ్చే వేసవికాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మంచినీటిని సకాలంలో అందించటకు ప్రణాళిక రూపొందించుకోవాలని వారు తెలిపారు. ముఖ్యంగా అంగన్వాడి భవనాలు శిథిల వ్యవస్థలో ఉన్నాయని నూతన భవనాలకు నిధులు మంజూరు చేయాలని. భగీరథ పైప్ లైన్ మూలంగా గుంతలుగా ఏర్పడ్డ రోడ్డులను తక్షణమే సిసి రోడ్ల ద్వారా మరబతులు చేపట్టాలని వారు కోరారు ముఖ్యంగా మార్కెట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొనడం జరుగుతుందని వెంటనే రైతు బజార్ ప్రారంభోత్సవం చేయాలని రైతు బజార్ కాంట్రాక్టర్ తాళం వేసుకోవడం జరిగిందని వెంటనే అతనితో మాట్లాడి రైతు బజార్ ప్రారంభోత్సవం చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని ట్రాఫిక్ నియంత్రణ సమస్య ఉండదని కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లతోపాటు మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు మొదటి సమావేశానికి విచ్చేసిన ముఖ్య అతిథులను ఎమ్మెల్సీ అంజిరెడ్డి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ లను ఘనంగా సన్మానించారు.

డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ల సంఖ్య పెంపుపై

ప్రభుత్వానికి ప్రతిపాదించాం

- డీజేఎస్‌తో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి
- జిల్లా అక్రెడిటేషన్ కమిటీల్లో డెస్క్ జర్నలిస్టుకు స్థానంపై పరిశీలిస్తం
- ఫీల్డ్, డెస్క్ అనే తేడా లేకుండా మహిళలకు 33 శాతం కోటా ఉంటుందని వెల్లడి
- రెండోసారి బాధ్యతలు చేపట్టిన చైర్మన్‌కు డీజేఎస్ అభినందనలు

ప్రతిపక్షం, హైదరాబాద్, మార్చి 10: మనమంతా వర్కింగ్ జర్నలిస్టులమని.. డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులు అనే తేడాలు ఏమీ ఉండవని అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వబోమని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డెస్క్ జర్నలిస్టులకు కార్డుల సంఖ్య పెంచడం సహా రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ మొదటి మీటింగ్‌లో చర్చకు వచ్చిన పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. మీడియా అకాడమీ చైర్మన్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం డెస్క్ జర్నలిస్టుల సంఘం(డీజేఎస్) ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం డీజేఎస్ అధ్యక్షుడు బాదిని ఉపేందర్, డీజేఎస్ ప్రతినిధులు డెస్క్ జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలతో కూడిన వినతపత్రం అందజేసి.. వాటిని పరిష్కరించాల్సిందిగా కోరారు. సెంట్రల్ డెస్కులు, జిల్లాల డెస్కుల్లో పనిచేసే జర్నలిస్టులకు జారీ చేసే కార్డుల సంఖ్య పెంచాలని కోరగా స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి ఈ అంశంపై ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించామని.. ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీలో డెస్క్ జర్నలిస్టుల ప్రతినిధికి స్థానం కల్పించినట్టుగానే జిల్లా అక్రెడిటేషన్ కమిటీల్లో కూడా డెస్క్ జర్నలిస్టులకు స్థానం కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేయగా.. సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయంపై ఐ అండ్ పీఆర్ అధికారులతో మాట్లాడతానని తెలిపారు. అలాగే ఫీల్డ్, డెస్క్ అనే తేడా లేకుండా అక్రెడిటేషన్ కార్డుల జారీలో మహిళా జర్నలిస్టులకు 33 శాతం కోటా వర్తింపజేయాలని కోరాగా.. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు ప్రస్తుతం జారీ చేయనున్న అక్రెడిటేషన్ కార్డుల సంఖ్యకు అదనంగా 33 శాతం కార్డులు మహిళలకు కేటాయించాలనుకుంటున్నట్టు తెలిపారు. ఒకవేళ ఆ సంఖ్య మేరకు సంస్థల్లో మహిళలు లేకపోతే వాటిని ఖాళీగానే ఉంచాల్సి ఉంటుందన్నారు. జర్నలిస్టులకు జారీ చేసే హెల్త్ కార్డులు ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరగా ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన వారిలో డీజేఎస్ ప్రతినిధులు రాజారామ్, వెంకటరమణ, సీహెచ్.సైదిరెడ్డి, ఎస్.వెంకటేశ్, నరేందర్ తదితరులు ఉన్నారు.

సిద్దిపేటలో ప్రజావాణిలో 169 వినతులు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 9 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వినతులను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి ఫిర్యాదులు అందజేస్తున్నారని తెలిపారు. అందువల్ల అధికారులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 169 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, ఏఓ రాజ్‌కుమార్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటేలో సత్తా చాటిన సిద్దిపేట జిల్లా విద్యార్థులు

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 9 : జాతీయస్థాయి కరాటే పోటీల్లో సిద్దిపేట జిల్లా విద్యార్థులు సత్తా చాటారని యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. కిక్కర్స్ మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లోని కంతేడాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో మూడవ జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ కరాటే పోటీలకు పలు రాష్ట్రాల నుండి సుమారు 2000 మంది విద్యార్థులు పాల్గొని కరాటే పోటీల్లో సిద్దిపేట జిల్లాకి చెందిన 65 మంది విద్యార్థులు 39 గోల్డ్ మెడల్స్, 26 సిల్వర్ మెడల్స్ సాధించారని కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. అలానే కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ ని కిక్కర్స్ మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ వారు శాలువాతో ఛాంపియన్షిప్ కప్పుతో అలానే మాస్టర్ మెమెంటోతో అభినందించారు. సిద్దిపేట పట్టణంలోని స్ప్రింగ్ డయల్ స్కూల్ 1 గోల్డ్ మెడల్. దుబ్బాక మండలంలోని రామక్కపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల 20 గోల్డ్ మెడల్స్, 22 సిల్వర్ మెడల్స్, దుబ్బాక మునిసిపాలిటీ పరిధిలోని లచ్చ పేట మోడల్ స్కూల్ 3 గోల్డ్ మెడల్స్, 1 సిల్వర్ మెడల్. దుబ్బాక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల 3 గోల్డ్ మెడల్స్,1 సిల్వర్ మెడల్. దిశా స్కూల్ 1 సిల్వర్ మెడల్. మాస్టర్ మైండ్ స్కూల్ 4 గోల్డ్ మెడల్స్, 1 సిల్వర్ మెడల్. మిరుదొడ్డి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల 8 గోల్డ్ మెడల్స్ సాధించారని మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపాడు. పతకాలు సాధించిన విద్యార్థులను కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్, సురేందర్ యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఉపాధ్యక్షురాలు మారోజు స్నేహ, డి.ఇ.ఓ శ్రీనివాస్ రెడ్డి, డి.సి.డి.ఓ నర్మద రామక్కపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ శారద వెంకటేష్ (డి సి ఓ), పిడి రాజేశ్వరి, పిటి పద్మ. లచ్చ పేట మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ బుచ్చిబాబు, పి టి రవీందర్. దుబ్బాక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఎస్ ఓ స్వాతి పిటి నిషా. మిరుదొడ్డి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఎస్. ఓ స్వర్ణలత పిటి భాగ్యమ్మ. దుబ్బాక దిశా స్కూల్ ప్రిన్సిపల్ కమలాకర్, యాదగిరి, ఆనంద్, పిటి నాగేష్‌నాగరాజు అభినందించారు.

'చిరంజీవి రాష్ట్రం విడిపోయిన తర్వాత పార్టీ పెట్టి ఉండాల్సింది. అలా అయితే సీమాంధ్రలో కచ్చితంగా అధికారంలోకి వచ్చి ఉండేవారు. రాంగ్ టైమ్‌లో పార్టీని స్థాపించారు. 2014 ఎన్నికల వరకైనా పార్టీని కొనసాగించి ఉంటే అధికారంలోకి వచ్చి ఉండేవారేమో.

\- నటుడు శివాజీ

హుస్నాబాద్‌ను ఆదర్శంగా నిలపాలి

- 99 రోజుల లక్ష్యంతో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'
- మంత్రి పొన్నం ప్రభాకర్
- రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ ఆకస్మిక తనిఖీ
- ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన 99 రోజుల 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక' ద్వారా గ్రామాలను సర్వతోముఖాభివృద్ధి చేయడమే లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమవతి అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. పది ప్రత్యేక అంశాల ప్రాతిపదికన రూపొందించిన ఈ ప్రణాళిక నిర్వహణలో హుస్నాబాద్ మండలం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సర్పంచులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వివిధ దశల్లో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. హుస్నాబాద్ ప్రజల కోసం సురభి, ఆర్వీఎం, సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలల ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. విద్యా వ్యవస్థ బలోపేతంపై మాట్లాడుతూ..మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను 1,700 నుండి 2,500కు పెంచాలని, అధిక ఎన్రోల్మెంట్ సాధించే పాఠశాలలకు ప్రత్యేక నిధులు, మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.యువత గంజాయి వంటి మాదకద్రవ్యాల బారిన పడకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో మార్పులు రావాలని, వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ వంటి ఉద్యానవన పంటల వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఉచిత బస్సు ప్రయాణం, బ్యాంకు లింకేజీ రుణాలు, ఇందిరా మహిళా శక్తి పథకాలు క్షేత్ర స్థాయిలో సక్రమంగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ నివారణలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు అందించిన స్టీల్ బ్యాంకులను కచ్చితంగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హైమవతి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు తమ గ్రామాభివృద్ధిని నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని, 99 రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా 'సాహస్' స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో 17 గ్రామ పంచాయతీలకు మంత్రి చేతుల మీదుగా ఉచిత మైక్ సెట్లను పంపిణీ చేశారు. అనంతరం 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ ఆకస్మిక తనిఖీ

హుస్నాబాద్ మండల కేంద్రంలో సోషల్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ మధ్యాహ్న భోజన సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూలో ఉన్న వంటకాలు విద్యార్థినులకు వడ్డిస్తున్నారా? లేదా అని పరిశీలించారు. స్వయంగా ప్లేట్ తీసుకొని క్యూ లైన్ లో నిలబడి వడ్డించుకొని విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట మనుషులతో మాట్లాడి విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థినులు ఆహారం విషయంలో రాజీలేదని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని ప్రతిరోజూ పరిశీలించాలని ప్రిన్సిపల్ విజయ ను ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన మెను ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని సూచించారు..

ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన

హుస్నాబాద్ లో నిర్మితమవుతున్న 250 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఇప్పటికే పిల్లర్ల దశకు చేరుకున్న ఆసుపత్రి నిర్మాణం వచ్చే ఏడాదిలోపు పూర్తి చేయలని మంత్రి అధికారులను ఆదేశించారు. హాస్పిటల్ భవన నిర్మాణంలో పలు అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచనలిచ్చారు.

ప్రమాద బీమా చెక్కును అందజేసిన మంత్రి

మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా హుస్నాబాద్ పట్టణంలోని గాయత్రీ కో ఆపరేటివ్‌బ్యాంక్‌ఖాతాదారుడి కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. హుస్నాబాద్ మండలం కుచనపల్లి గ్రామానికి చెందిన మాతూరి రవి ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు గాయత్రీ కో ఆపరేటివ్‌బ్యాంక్‌లో ఖాతా ఉండగా, బ్యాంకు తరఫున ఉన్న ప్రమాద బీమా పథకం కింద ఆయన కుటుంబ సభ్యులకు ₹1,00,000 (ఒక లక్ష రూపాయలు) చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, అధికారులు వేణు, శశికుమార్ పాల్గొన్నారు. మంత్రి బాధిత కుటుంబానికి సానుభూతి తెలియజేసి, బ్యాంకు అందించిన సహాయాన్ని అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 9: వరంగల్ కరీంనగర్ ప్రధాన జాతీయ రహదారిలో హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి శాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలో వరంగల్ కరీంనగర్ మార్గంలో ఉన్న హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు సమీపంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం సంభవిస్తున్న నేపథ్యంలో జాతీయ రహదారులుఆర్ అండ్ బి సాగునీటి పారుదల పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి ప్రమాదకరంగా ఉన్న బ్లాక్ స్పాట్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద చోటు చేసుకుంటున్నా రోడ్డు ప్రమాదాలు, జరుగుతున్న ప్రాణ నష్టం పై ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, సంబంధిత అధికారులకు తెలియజేయగా కలెక్టర్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, రోడ్డు విస్తరణకు ఉన్న అవకాశాలను ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ అక్కడికక్కడే సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద ప్రమాదాలు చోటు చేసుకున్న బ్లాక్ స్పాట్ ప్రాంతంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణతో ప్రమాదాలు తగ్గుతాయి కాబట్టి ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు ఈ సందర్భంగా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వరంగల్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, తహసీల్దార్ కిరణ్ కుమార్, పోలీస్ ఇన్స్పెక్టర్ చేరాలు , సాగునీటి పారుదల, మున్సిపల్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయుల పాత్ర కీలకం

- జర్నలిస్టులకు ఎప్పుడు అండగా ఉంటా
- టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 9 : ప్రజాజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్వా గార్డెన్ లో ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు నిజాయితీగా తెలియజేసే బాధ్యత మీడియాపై ఉందని, ప్రజల సమస్యలను పాలకులకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కొత్త కమిటీ జర్నలిస్టుల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టులో లేనిది రాజకీయ నాయకులు లేరనే సూక్తి నేను నమ్ముతానని అన్నారు. నా రాజకీయ మార్గంలో ఎందరో జర్నలిస్టులు నాకు ఎంతో సహకారం అందించారని, తాను ఈ స్థాయిలో ఉండడానికి జర్నలిస్టులు కూడా ఓ కారణం అన్నారు. పీసీసీ నాయకుడిగా కాకుండా జర్నలిస్టులకు సోదరిడిగా ఉంటూ, మీ కష్టాల్లో పాలు పంచుకుంటానని అన్నారు. ప్రతిరోజు వివిధ పేపర్లు చదివితేనే ఎంతో తృప్తిగా ఉంటుందన్నారు. దేశంలో పేదవారి జీవితంలో మార్పు వచ్చేలా కథనాలు రాయాలన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానాని అన్నారు. నా రాజకీయ ఎదుగుదలకు జర్నలిస్టులు సహకారం అందించారని, కాబట్టి స్థాయిలో ఉన్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలో షబ్బీర్ అలీ, అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలతో కలిసి వీలైనంత త్వరగా కలెక్టర్ తో మాట్లాడి పరిష్కరిస్తాను అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ... జర్నలిస్ట్ లు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం హౌసింగ్ సొసైటీల ఏర్పాటు తోనే సాధ్యం అవుతుందన్నారు. మీ సమస్యను టీపీసీసీ చీఫ్, స్థానిక ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, భూపతిరెడ్డి మేమందరం కలిసి దశ దిశా నిర్దేశం చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ... జరలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్య కొత్తదేమి కాదని, రూరల్ నియోజకవర్గంలో స్థలం చూసి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అప్పజెప్పే బాధ్యత తీసుకుంటామన్నారు.కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టులకు అండగా ఉంటుందన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ మాట్లాడుతూ మీడియా ప్రజల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వారధి అని, వారి సమస్యలు పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. జర్నలిస్ట్ ల న్యాయమైన సమస్య ఇళ్ల స్థలాల గత బీఆర్ఎస్ హయాంలో మాట తప్పారని, కాంగ్రెస్ ప్రభుత్వం వారికి వెంటనే ఇల్లాస్థలాలు ఇవ్వాలని కోరారు. నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉమారాణి నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టులకు వెల్నెస్ ఆసుపత్రి ఉచిత ఐడి కార్డ్ ల ఆవిష్కరణ

వెల్నెస్ ఆస్పత్రిలో జర్నలిస్టులకు ఉచితంగా వైద్యం అందించేలా రూపొందించిన ఐడి కార్డు లను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. జర్నలిస్టులకు అండగా మేముంటామని వెల్నెస్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ అసద్ ఖాన్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులతో పాటు వారి కుటుంబ సభ్యులకు పూర్తిగా ఉచిత వైద్యం అందిస్తామని ఆస్పత్రి అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా, నగర అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, కాటిపల్లి నరేందర్ రెడ్డి, ఖుద్దూస్, వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు ప్రెస్ క్లబ్ నూతన కమిటీ నూతన కార్యవర్గ అధ్యక్షుడు పంచరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి డా వాగ్మారే సుభాష్, కోశాధికారి రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.రాజు , కార్యవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా శక్తితో అద్భుత ఫలితాలు సాధ్యం

- మహిళలు మానసిక దృఢత్వంపై దృష్టి పెట్టాలి
- కావేరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. ప్రవీణ్ రావు

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్) మార్చి 9: మహిళలు తలుచుకుంటే అద్భుత ఫలితాలు సాధిస్తారని కావేరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రవీణ్ రావు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం, గౌరారంలోని కావేరి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా "శక్తి నేషనల్ లీడర్‌షిప్ కాంక్లేవ్ 2026 ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులలో స్ఫూర్తిని నింపేందుకు ప్రముఖ మహిళా సాధకులను ఒకే వేదికపైకి తేగా, ఉపన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ సెషన్ల ద్వారా మహిళా నాయకత్వం, ఆత్మస్థైర్యం, సమాజానికి వారు చేసిన సేవలు పేర్కొంటూ స్ఫూర్తిని నింపారు. విద్య, ఉపాధి, నాయకత్వంలో వారికి సమాన అవకాశాలు దక్కితేనె సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని వైస్ ఛాన్సలర్ పేర్కొన్నారు. "శక్తి" కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇంతటి విజయం సాధించిన మహిళలు క్యాంపస్‌కు రావడం విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరడానికి, సంప్రదాయ అడ్డంకులు అధిగమించడానికి ఎంతో ప్రేరేపిస్తుందని తెలిపారు. ఆభాస రిహాబ్ సెంటర్ డైరెక్టర్ గాయత్రి అరవింద్, ఎస్ఎంఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ మంజుల రావు, ఐసిఏఆర్ రిటైర్డ్ ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త కెబిఆర్ఎస్ విశారద, గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత సోఫియా సూఫీ, స్ట్రాటజీ మరియు బిజినెస్ మాజీ సీఈఓ వైశాలి నియోజియా, క్లాసికల్ డ్యాన్సర్, గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ గ్రహీత విదూషి దీక్ష లను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సత్కరించారు. విద్యార్థిని అంజలి బృందం స్త్రీతత్వాన్ని కీర్తిస్తూ చేసిన ప్రదర్శన ఉత్సాహం నింపింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఛాన్సలర్ భాస్కర రావు కార్యక్రమ విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్సిటీలో జరిగిన వేడుక చిరస్మరణీయంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు, డైరెక్టర్ హర్ష పోలసాని, డీన్స్ డాక్టర్ కొండ శ్రీనివాస్, డాక్టర్ ప్రతాప్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రను కేంద్రం మానుకోవాలి

- డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి

ప్రతిపక్షం సిద్దిపేట టౌన్, మార్చి 9: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూముకుంట ఆంక్షా రెడ్డి డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండలంలోని లక్ష్మీదేవిపల్లి, కోదండరావుపల్లి, బంజారుపల్లి, ఇబ్రహీంపూర్, మాటెంట్ల, శేకరంపేట గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికులతో సోమవారం నిర్వహించిన సమావేశాలలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆమె విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చే కుట్రతో పాటు కేంద్రం ఇచ్చే నిధులను తగ్గించి రాష్ట్రాలపై భారం మోపే ప్రయత్నం జరుగుతోందని ఆమె అన్నారు. ప్రస్తుతం ఉన్న విధానాన్ని మార్చి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు ఇవ్వాలనే ప్రతిపాదనలు తీసుకురావడం ద్వారా ఈ పథకాన్ని బలహీనపరచాలని చూస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు, కార్మికులకు ఉపాధి భద్రత కల్పించేందుకు యూపీఏ ప్రభుత్వం కామన్ మినిమం ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఆమె గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా పేదలు, గిరిజనులు, కార్మికులు ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా ఉండేందుకు ఈ పథకం ఎంతో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. అలాంటి పథకాన్ని రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆమె స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికులు, రైతులతో సమావేశాలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

రాష్ట్రంలోని రెండవ హజ్ హౌస్ సిద్దిపేటలోనే నిర్మాణం

- 35 సంవత్సరాల క్రితమే ఇఫ్తార్ విందును ప్రారంభించిన కేసీఆర్..
- రంజాన్ పండుగను అధికారికంగా నిర్వహించిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం
- అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే బీఆర్ఎస్ ముఖ్య లక్ష్యం
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, మార్చి 9: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 35 సంవత్సరాల క్రితమే సిద్దిపేట నియోజకవర్గంలోని చింతమడకలో ఇఫ్తార్ విందును ప్రారంభించారని మాజీ మంత్రి, అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఎమ్మెల్యే హరీష్‌రావు తెలిపారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇక్బాల్ మినార్ ఈద్గా మైదానంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిద్దిపేటలో ప్రారంభమైన ఇఫ్తార్ విందులు నేడు దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయని తెలిపారు.అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ పాలన కొనసాగిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత మొట్టమొదటి హజ్ హౌస్ సిద్దిపేటలోనే నిర్మించబడిందన్నారు. సిద్దిపేట అభివృద్ధిలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.గతంలో రంజాన్ పండుగ సందర్భంగా సదుపాయాల కోసం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాల్సి వచ్చేదని, కానీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసే విధంగా ప్రభుత్వం పనిచేసిందన్నారు.రాష్ట్రంలోనే తొలిసారిగా "ఆఖరి సఫర్" అనే అంతిమ యాత్ర వాహనాన్ని కూడా సిద్దిపేటలోనే ప్రారంభించామని తెలిపారు. ప్రతి సంవత్సరం తన సొంత ఖర్చుతో పదిమంది నిరుపేద ముస్లింలను ఉమ్రా యాత్రకు పంపుతున్నానని చెప్పారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని, ముస్లిం మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేకంగా గురుకులాలు ఏర్పాటు చేసి సమాజుతో పాటు ఇంగ్లీష్ మీడియంలో విద్య అందించిందన్నారు.రంజాన్ పండుగను అధికారికంగా నిర్వహించిన ప్రభుత్వం కూడా కేసీఆర్ ప్రభుత్వమేనని తెలిపారు. నిరుపేదలు సైతం సంతోషంగా పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా రంజాన్ తోఫా అందించామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం మహమ్మద్ అలీ మస్కటి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ హరీష్ రావు సిద్దిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపారని, ఇక్కడి ప్రజలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తున్నారని పేర్కొన్నారు.

ఇజ్రాయెల్, ఇరాన్ నేతలకు పీఎం మోదీ ఒక్క ఫోన్ చేస్తే యుద్ధం ఆగుతుంది. గల్ఫ్ నేతలే కాకుండా ప్రజలు, బిజినెస్ కమ్యూనిటీల్లోనూ మోదీపై గౌరవం ఉంది. యుద్ధంలోకి దిగే ఆలోచన మాకు లేదు. యూఏఈని లాంచింగ్ ప్యాడ్‌గా వాడుకునేందుకు అంగీకరించబోం. ఇరాన్ మా పొరుగు దేశం... ఇజ్రాయెల్ మిత్రపక్షం, రెండింటితోనూ చర్చలు జరపగలం.

- ఇండియాలో యూఏఈ రాయబారి హుస్సేన్ హాసన్ మీర్జా

ప్రాంతీయం

గీతంకు వన మహోత్సవ అవార్డు

- మంత్రి వివేక్ చేతుల మీదుగా అందుకున్న గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 9 : హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గత ఏడాది (2025లో) చేపట్టిన పర్యావరణ స్థిరత్వం, హరిత కార్యక్రమాల నిరంతర నిబద్ధతకు గుర్తింపుగా వన మహోత్సవ అవార్డు - 2026తో సత్కరించారు. హైదరాబాదులో జరిగిన కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ యొక్క 202526 వార్షిక సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. మంత్రి జి.వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ఈ అవార్డును అందుకున్నారు. పెద్దయెత్తున మొక్కలు పెంచడం, ప్రాంగణంలో పర్యావరణ హిత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించి, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తున్న సంస్థలకు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. గీతం హైదరాబాదు ప్రాంగణం నిరంతరం మొక్కల పెంపకం, పర్యావరణ అవగాహనా సదస్సులు, సమాజాభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. తద్వారా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనడానికి, ప్రాంగణంలో ఆ సంస్కృతిని నిరంతరం కొనసాగించేలా ప్రోత్సహిస్తోంది. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, వివిధ స్కూళ్ల డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, పలు విభాగాల అధిపతులు తదితరులు ప్రతిష్టాత్మక వన మహోత్సవ అవార్డును అందుకున్నందుకు హర్షం వెలిబుచ్చారు. పర్యావరణ బాధ్యత, స్థిరమైన అభివృద్ధికి విశ్వవిద్యాలయం యొక్క నిరంతర నిబద్ధతకు గుర్తింపుగా వారు అభివర్ణించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 9 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పారిశుధ్యం, విద్యార్థులకు అందే సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇస్నాపూర్ లోని జెడ్పీ హైస్కూల్ మరియు డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, పారిశుధ్యం, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందన్నారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై మరింత దృష్టిసారించాలని సూచించారు. హాల్ టికెట్లు అందాయా, అందులో వివరాలు సరిగ్గా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు రివిజన్ చేస్తున్నారా అని ప్రశ్నిస్తూ ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన షెడ్యూల్ సరిగా అమలు కావడం లేదని గుర్తించిన కలెక్టర్, సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గుడ్లు అందించడం లేదని గమనించి, వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ అనుమతి లేకుండా గైర్హాజరు

కావడంపై ఆగ్రహించిన కలెక్టర్ హెచ్ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, అదేవిధంగా కొంతమంది ఉపాధ్యాయులు గైర్హాజరు కావడం పై ఎంఈఓ వివరణ ఇవ్వాలని, పర్యవేక్షణ లోపించినందుకు ఎంఈఓకు కూడా షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ స్పష్టం చేసారు. శానిటేషన్ గ్రాంట్ కింద ఎంత మందిని ఎంగేజ్ చేసుకుంటున్నారో, వారి పేర్లు, ఎప్పటి వరకు పేమెంట్ చేశారన్న వివరాలను అందించాలని సూచించారు.పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం , డైనింగ్ హాల్ సరిగా శుభ్రం చేయకపోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్, అక్కడ మంటలు చెలరేగిన ప్రాంతాన్ని 24 గంటల్లో వాటర్ ట్యాంకర్ల సహాయంతో పూర్తిగా ఆర్పివేయాలని ఆదేశించారు. సెగ్రిగేషన్ ప్రాంతంలో ఉన్న లెగసీ వ్యర్థాలను 48 గంటల్లో పూర్తిగా తరలించి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయాలని సూచించారు. డంపింగ్ యార్డ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమంగా చెత్త వేయకుండా 24 గంటల పర్యవేక్షణ ఉండేలా ఒక కార్మికుడిని నియమించాలని ఆదేశించారు. అలాగే వ్యర్థాలను సేకరించే మున్సిపల్ ఆటోలు, ప్రైవేట్ వాహనాల ద్వారా చెత్తను ఎక్కడ ప్రాసెస్ చేస్తున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే అంశంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆయా అంశాలపై వెంటనే చర్యలు తీసుకొని యాక్షన్ టేకన్ రిపోర్ట్ ను సమర్పించాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ సుమలత, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య బోధన

- ఇంద్రేశం కౌన్సిలర్ అంతిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 9 : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ను బోధించడం జరుగుతుందని ఇంద్రేశం కౌన్సిలర్ అంతిరెడ్డి గారి అంతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇంద్రేశం మున్సిపాలిటీ లోని రామేశ్వరం బండ వీకర్ సెక్షన్ కాలనిలోని ప్రభుత్వ పాఠశాలలో ఇంద్రేశం కౌన్సిలర్ అంతి రెడ్డి గారి అంతిరెడ్డి నూతన తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అంతిరెడ్డి మాట్లాడుతూ పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కృషితో, నిర్మాణ్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో రామేశ్వరం బండ వీకర్ సెక్షన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సిఎస్ ఆర్ నిధుల ద్వారా నాలుగు నూతన తరగతి గదుల నిర్మాణం మరియు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు గాను భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.

కొత్త తరగతి గదుల నిర్మాణం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన కల్పించబడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నిర్మాణ్ సంస్థ డైరెక్టర్ శశిధర్, సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ రెడ్డి, ఉపాధ్యాయులు మంజుల, సంధ్య, మాజీ ఉప సర్పంచ్ నగేష్, మాజీ వార్డ్ సభ్యులు సాయిలు, లోకేష్, రాములు, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

వైల్డ్ యాక్ట్ పేరుతో ఆదివాసీలకు అన్యాయం

- ఏఐటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ఆందోళన

ప్రతిపక్షం, గుండాల, మార్చి 9 : వైల్డ్ యాక్ట్ పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి మైదాన ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలను నిలిపివేయాలని, సాగు భూముల వద్ద వేస్తున్న ట్రెంచ్‌లను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం (ఏఐటీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఏఐటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఈసం కృష్ణ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీఎఫ్ జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, రాష్ట్ర కన్వీనర్ సూర్ణపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఆదివాసీలు అడవుల్లోనే జీవనం సాగిస్తున్నారని, ఎవరికీ హాని చేయని మూలవాసులను అడవుల నుంచి వెళ్లగొట్టేందుకు ఫారెస్ట్ అధికారులు నోటీసులు ఇవ్వడం, భయభ్రాంతులకు గురి చేయడం సరైంది కాదన్నారు. సాగు చేసుకుంటున్న భూముల వద్ద ట్రెంచ్‌లు వేయడం ద్వారా వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. అడవిలోని మూగజీవులు కూడా ఆదివాసీలతో అన్యోన్యంగా ఉంటుంటే, మనుషులే వారిపై అన్యాయం చేస్తున్నారని అన్నారు. రాజ్యాంగం ప్రతి భారత పౌరుడికి ఎక్కడైనా జీవించే హక్కు ఇచ్చిందని, అయితే ఫారెస్ట్ అధికారులు ఆ హక్కులను ఉల్లంఘిస్తూ ఆదివాసీలను అడవుల నుంచి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడవే ఆదివాసీల సంస్కృతి, జీవనాధారమని, వారు జీవించేది కూడా అడవిలోనే, మరణించేది కూడా అడవిలోనే అని అన్నారు.జిల్లాలో అనేక గిరిజనేతరుల చేతిలో భూములు ఉన్నప్పటికీ వాటిపై చర్యలు తీసుకోకుండా ఆదివాసీలపై మాత్రమే ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీలకు హక్కులు ఉన్నప్పటికీ వారిని మనుషులుగా చూడకుండా వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు.వన్యప్రాణుల సంరక్షణ పేరుతో తీసుకొచ్చిన వైల్డ్ యాక్ట్-20 ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఆదివాసీలకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలని, సాగు భూముల వద్ద వేస్తున్న ట్రెంచ్‌లను వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గొని నాగేశ్వరరావు, కల్తీ వెంకటేశ్వర్లు, ముసలి సతీష్, సంధ్య, కోట నాగమణి, గణేష్, సురేష్, రాజు, కృష్ణ, ఉంగరావు, జోగారావు, మడమి రమేష్, బీమా పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నల్ల బ్యాడ్జీలతో నిరసన

ప్రతిపక్షం, గుండాల, మార్చి 9: రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీ గుండాల మండలంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేజీబీవీ,యూఆర్ఎస్, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యల సాధన కోసం చేపట్టిన మొదటి దశ పోరాట కార్యక్రమంలో భాగంగా భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ కేజీబీవీ, యూఆర్ఎస్, ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది అనేక కాలంగా వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగులకు స్థిరత్వం, సముచిత వేతనాలు, సేవా భద్రత కల్పించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ గుండాల మండల ప్రధాన కార్యదర్శి ఎల్. రూప్‌సింగ్, శ్రీ బి. బాలోజి, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా

న్యాయ అవగాహన సదస్సులు

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 9 : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హత్నూర గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల మరియు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ పిల్లలు మరియు మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరమని తెలిపారు. బాలలపై జరిగే లైంగిక నేరాలను అరికట్టేందుకు అమలులో ఉన్న పోక్సో చట్టం కింద కఠినమైన శిక్షలు విధించబడుతున్నాయని వివరించారు. అలాగే డొమెస్టిక్ వైలెన్స్ చట్టం ద్వారా కుటుంబంలో మహిళలు ఎదుర్కొనే హింసకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని చెప్పారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

- పశువైద్యాధికారిణి డాక్టర్ దేవిరెడ్డి

ప్రతిపక్షం,మొయినాబాద్, మార్చి 9: గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి వేయించుకోవాలని అమ్డాపూర్ గ్రామ పశువైద్యాధికారిణి డాక్టర్ దేవిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నేటి నుంచి వచ్చేనెల 9వ తేది వరకు టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అమ్డాపూర్ మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. గాలికుంటు వ్యాధి పశువులకు తీవ్ర నష్టం కలిగించే అంటువ్యాధి కావడంతో ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేయించడం ఎంతో అవసరమని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రత్యేకంగా వైద్య బృందాలు ఏర్పాటు చేసి పశువులకు ఉచితంగా

టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులన్నింటికీ టీకాలు వేయించుకోవాలన్నారు.

సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పాఠశాలలో 2కే రన్

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 9: ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం చిలుకూరు లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సోనియా దర్శన్ మాట్లాడుతూ ...ఆరోగ్యకరమైన జీవన విధానానికి క్రీడలు మరియు వ్యాయామం ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా 2కే రన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల్లో అక్రమ నిర్మాణాలు

- మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, మార్చి 9: మక్తల్ పట్టణ కేంద్రంలోని సర్వే నంబర్ 936, 941లలో ఉన్న క్రైస్తవ మతపరమైన ఆస్తుల్లో సాగుతున్న అక్రమ, అనధికారిక నిర్మాణాలపై మక్తల్ ఎంబి ప్రాపర్టీ కస్టోడియన్&చైర్మన్ రెవరెండ్ ఇ. ప్రసాద్, సంఘం సభ్యులు స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హైదరాబాద్ రాయచూర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ అత్యంత విలువైన భూమిపై ప్రస్తుతం కోర్టులో వివాదాలు నడుస్తున్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతుండటం చట్ట విరుద్ధమని, ఈ భూమికి సంబంధించి హైకోర్టులో డబ్ల్యూపి నెం. 27553/2019, నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్ నెం. 87/2024 కేసులు విచారణలో ఉన్నాయి. టైటిల్ డిక్లరేషన్, భూమి స్వాధీనం కోరుతూ దాఖలైన ఈ కేసులు పెండింగ్‌లో ఉండగానే సూర్యనారాయణ గుప్తా, ఇతరులు అక్కడ వాణిజ్య సముదాయ నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దేశ చట్టాలను, కోర్టు ఆదేశాలను ఏమాత్రం గౌరవించకుండా అక్రమంగా ముందుకు వెళ్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై 22 నవంబర్ 2025 అలాగే గత నెల 17 న మున్సిపల్ అధికారులకు

లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినట్లు బాధితులు గుర్తుచేశారు. కోర్టు పరిధిలో ఉన్న భూముల్లో ఎటువంటి వాణిజ్య సముదాయాలకు అనుమతులు మంజూరు చేయవద్దని, ప్రస్తుతం జరుగుతున్న చట్టవిరుద్ధ పనులను తక్షణమే నిలిపివేయాలని వారు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. చట్టపరమైన వివాదాలు తేలే వరకు అధికారుల జోక్యం అవసరమని, మతపరమైన ఆస్తులను కాపాడాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అనంతరం అక్రమనిర్మాణాలు చేపడుతున్న దగ్గర సర్వే నంబర్ 936, 941లలో చేపడుతున్న అక్రమ నిర్మాణాల విషయం స్థానిక మున్సిపల్ కమీషనర్ కి తెలిసినా కూడా చర్యలు తీసుకోవడం లేదని, చట్ట పరంగా ఆ భూములలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కోర్టు ఆదేశాలను కమీషనర్ తుంగలో తొక్కి నిర్మాణాలకు సహకరిస్తున్నారని, ఇలాగే అధికారులు చూసి చూడకుండా వ్యవహరిస్తే రాష్ట్ర దళిత క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని, అలాగే కమీషనర్ పై చర్యలు తీసుకోవాలని పై అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంబి సంఘం సభ్యులు జిజి పౌల్, జె ఎన్. దేవదానం, బూషణము, జోసప్,సత్యనందం,యేసుకుమార్, కీరవాణి రాజ్, కోండన్న, అబ్రాహాము,సుధాకర్, ప్రేమ్ రాజ్, క్లెమెంట్ , పిలోమోన్, డేవిడ్ రాజ్, యోహాను తదితరులు పాల్గొన్నారు.

గతంలో సారా తాగి 115 ఏళ్ల పాటు బతికారు, ఇప్పుడు లిక్కర్ తాగి 80 ఏళ్లకే చనిపోతున్నారు. రాష్ట్రంలో సారా దుకాణాలు ఓపెన్ చేయాలని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కోరతా. సైంటిఫిక్‌గా సారా ఆరోగ్యానికి హానికరం కాదు. ఇటీవల కొన్ని రాష్ట్రాలు సారా దుకాణాలు ప్రారంభించాయయి. అసలు తెలంగాణలో సారా దుకాణాలు ఎందుకు బంద్ చేశారో క్లారిటీ రావాలి.

- జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

అమెరికా, ఇజ్రాయెల్‌తో మోడీ రాజీ

- పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు రాహుల్ పట్టు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 9: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్ లో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడటం లేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్ లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఎలా రాజీ పడ్డారో బహిర్గతమవుతున్నదని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు దేశ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. అలాగే అక్కడి సంక్షోభం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. ''పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. స్టాక్ మార్కెట్లలో ఏం జరుగుతుందో మీరు చూశారు. ప్రధాని మోదీ అమెరికా ట్రేడ్ డీల్‌పై సంతకం చేశారు. దీంతో దేశం దెబ్బ తినబోతోంది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చించడంలో వారికి ఏ సమస్య ఉంది? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా మన దేశానికి ముఖ్యం కాదా? ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం మనకు ముఖ్యమైన చర్చనీయాంశాలు కావా? అవే మనకు ప్రజా సమస్యలు'' అని రాహుల్ గాంధీ అన్నారు. ''కేంద్ర సర్కార్ పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చ జరిపేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఆ అంశంపై చర్చ జరిపితే ఇతర విషయాలు బయటకు వస్తాయి. ప్రధాని మోదీ వైఖరి బయటపడుతుంది. మోదీ ఎలా రాజీ పడ్డారు? ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు? వంటి విషయాలు తెలుస్తాయి. అందుకే పార్లమెంట్ లో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు కేంద్రం ఇష్టపడడం లేదు. చర్చకు డిమాండ్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఒకవేళ పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ జరిగితే ప్రధాని మోదీ పార్లమెంట్‌కు రాలేరు'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

విశ్వ వీక్షణం

రేపటి వెలుగు కోసం నేటి దీపాన్ని ఆర్పేస్తున్నారా?

ఈ ప్రాజెక్ట్ ఒక కొలిక్కి వస్తే అప్పుడు హాయిగా నవ్వుతాను, జాబ్లో ప్రమోషన్ లెటర్ చేతికి వచ్చాక గ్రాండ్గా సెలబ్రేట్ చేసుకుంటాను, పిల్లలు ప్రయోజకులై ఒక ఇంటివారయ్యాక తీరికగా నా కోసం నేను జీవిస్తాను. ఇలాంటి డైలాగులు మన దైనందిన జీవితంలో నిత్యం వింటూనే ఉంటాం. బహుశా మనకు మనమే రోజుకు వందసార్లు చెప్పుకుంటూ ఉంటాం కూడా! మనం ఎప్పుడూ రేపటి కోసం, అపరిచిత భవిష్యత్తు కోసం పరిగెడుతూ, కళ్లెదుటే ఉన్న నేటి సంతోషాన్ని, వర్తమానంలోని తీపి క్షణాలను నిరవధికంగా వాయిదా వేస్తూ ఉంటాం. ఇది కేవలం ఒక అలవాటు మాత్రమే కాదు, ఇది మన మానసిక ఆరోగ్యాన్ని, మన జీవన మాధుర్యాన్ని నిశ్శబ్దంగా హరించేసే ఒక ప్రమాదకరమైన సైకలాజికల్ ట్రాప్ (Psychological Trap). మనం పుట్టినప్పటి నుంచే ఒక విధమైన వాయిదా సంస్కృతి లో పెరుగుతున్నాం. ఇప్పుడు కష్టపడితేనే రేపు సుఖపడతావు, పదవ తరగతి పాసైతే చాలు జీవితం సెటిల్ అయిపోతుంది. బీటెక్ పూర్తి చేస్తే ఇక ఎంజాయ్ చేయొచ్చు ఇలాంటి గైడ్ లైన్స్ మన ఇంట్లో, స్కూల్లో పదే పదే

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

వినిపిస్తాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే ఈ మాటల్లో ఆశయం ఉన్నప్పటికీ, తెలియకుండానే ఒక తప్పుడు సందేశం మన మెదడులో రిజిస్టర్ అయిపోతోంది. అది ఏమిటంటే, ప్రస్తుతం మనం పడుతున్న కష్టం సంతోషానికి వ్యతిరేకం. సంతోషం అనేది భవిష్యత్తులో ఏదో ఒక మైలురాయిని దాటిన తర్వాత మాత్రమే దక్కే బహుమతి. ఈ క్రమంలో మనం వర్తమానాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాం. పిల్లలకు బెస్ట్ ఎడ్యుకేషన్ ఇవ్వాలని, విలాసవంతమైన విల్లా కట్టుకోవాలని, బ్యాంక్ బ్యాలెన్స్ పెంచుకోవాలని నిరంతరం ఉరుకులు పరుగులు పెడుతూ, అసలు ఎవరి కోసం ఇదంతా చేస్తున్నామో వారితో గడిపే సమయాన్ని, ఆ అనుభూతిని కోల్పోతున్నాం. సమాజం నిర్ణయించిన సక్సెస్ పారామీటర్లు కూడా దీనికి ప్రధాన కారణం. హోదా, అధికారం, సంపద ఇవన్నీ సాధించిన రోజే మనిషికి విలువ, ఆ రోజే అసలైన ఆనందం అని మనం గుడ్డిగా నమ్ముతున్నాం. అది సాధించే వరకు మన జీవితం కేవలం ఒక యుద్ధంలా, ఒక నిరంతర త్యాగంలా మిగిలిపోతోంది .మానసిక శాస్త్రవేత్తలు ఈ వింత ధోరణిని డిఫర్డ్ హ్యాపినెస్ సిండ్రోమ్ (Deferred Happiness Syndrome) అని పిలుస్తారు. ఇది ఒక క్లిష్టమైన మానసిక స్థితి. ఇందులో వ్యక్తులు తమ ప్రస్తుత ఆనందాన్ని భవిష్యత్తులో ఏదో ఒక ఊహాజనిత లక్ష్యంతో ముడిపెడతారు. అది జరిగితేనే నేను సంతోషిస్తాను అనే కండిషన్ పెట్టుకుంటారు. దీనివల్ల వాళ్ల మెదడు ప్రస్తుత క్షణంలో లభించే చిన్న చిన్న రిలీఫ్ పాయింట్స్ను కూడా గుర్తించలేకపోతుంది. మనిషి సహజంగానే లక్ష్యాలను ప్రేమిస్తాడు. లక్ష్యాలు ఉండటం వల్ల జీవితానికి ఒక స్పష్టత వస్తుంది. కానీ, లక్ష్యాన్ని చేరుకోవడమే జీవితం అనుకోవడం పొరపాటు. సైకలాజికల్ రీసెర్చ్ ప్రకారం, మనం ఒక పెద్ద గోల్ సాధించినప్పుడు కలిగే కిక్ చాలా తక్కువ కాలం

> **45 ఏళ్ల ఒక సాఫ్ట్‌వేర్ మేనేజర్ ఉన్నాడనుకుందాం. అతనికి అంతా ఉంది, కానీ ప్రశాంతత లేదు. రిటైర్మెంట్ తీసుకున్నాక వరల్డ్ టూర్ వెళ్తాను, అప్పుడు నా గార్డెనింగ్ హాబీని చూసుకుంటాను అని చెప్తుంటాడు. కానీ 60 ఏళ్ల వయసులో అతని ఆరోగ్యం ప్రయాణాలకు సహకరిస్తుందా? అప్పటికి అతనిలో ఇప్పుకున్నంత ఎనర్జీ ఉంటుందా? అంటే సమాధానం లేదు. ప్రస్తుతం తన చేతిలో ఉన్న అద్భుతమైన కాలాన్ని, రిటైర్మెంట్ తర్వాత రాబోయే అనిశ్చిత కాలం కోసం బలి ఇస్తున్నాడు. అలాగే చాలా మంది పేరెంట్స్ తమ కలలను చంపేసుకుని పిల్లలే నా సర్వస్వం అంటారు. పిల్లలు సెటిల్ అయి అమెరికాకో, మరో ఊరికో వెళ్లిపోయాక, వీరికి మిగిలేది ఒక పెద్ద శూన్యం మాత్రమే.**

ఉంటుంది. దీనినే హెడోనిక్ ట్రెడ్మిల్ (Hedonic Treadmill) అంటారు. అంటే, మనం ఎంత ఎత్తుకు ఎదిగినా, కొత్త పరిసరాలకు త్వరగా అలవాటు పడిపోయి మళ్ళీ పాత అసంతృప్తి స్థాయికి చేరుకుంటాం. అందుకే ఒక లక్ష్యం పూర్తి కాగానే, వెంటనే మరో పెద్ద లక్ష్యం కోసం సంతోషాన్ని తాకట్టు పెట్టేస్తాం. ఈ సైకిల్ ఎప్పటికీ ముగియదు. సంతోషాన్ని వాయిదా వేయడం వల్ల మన వ్యక్తిగత, సామాజిక జీవితాల్లో చీకటి కమ్ముకుంటుంది .అంతులేని అసంతృప్తి, ఇంజనీరింగ్ అయ్యాక సంతోషిస్తాను అన్నవాడు, ఆ తర్వాత మంచి ప్యాకేజీతో జాబ్ వచ్చాక అంటాడు. జాబ్ వచ్చాక పెళ్లి అయ్యాక, ఆ పైన ప్రమోషన్ వచ్చాక అంటూ పోస్ట్ పోన్ చేస్తూనే ఉంటాడు. చివరకు వెనక్కి తిరిగి చూసుకుంటే సంతోషించిన క్షణాల కంటే, ఆ సంతోషం కోసం ఎదురుచూసిన క్షణాలే ఎక్కువగా ఉంటాయి. దెబ్బతింటున్న బంధాలు, భవిష్యత్తు కోసం పరుగు తీసే క్రమంలో మనం పక్కనే ఉన్న మనుషులను మర్చిపోతున్నాం. ఇప్పుడు నాకు టైమ్ లేదు, బిజీగా ఉన్నాను అని చెప్తూ పిల్లల ముద్దుల బాల్యాన్ని, భార్యాభర్తల మధ్య ఉండాల్సిన ఆత్మీయతను, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు కావాల్సిన తోడును మిస్ అవుతున్నాం. ఆ క్షణాలు మళ్లీ కోట్లు పోసినా తిరిగి రావు. మానసిక ఒత్తిడి (Stress & Anxiety), ఎప్పుడూ రేపటి గురించిన ఆందోళన, టార్గెట్స్ రీచ్ అవ్వాలనే ఒత్తిడి వల్ల రక్తపోటు, నిద్రలేమి, డిప్రెషన్ వంటి సమస్యలు చుట్టుముడుతున్నాయి. జీవితం అంటే ఒక గిఫ్ట్ లా కాకుండా, ఒక



మోయలేని బాధ్యతలా తయారవుతోంది. మన చుట్టూ ఉన్న వ్యక్తులను గమనిస్తే ఇది స్పష్టంగా అర్థమవుతుంది. 45 ఏళ్ల ఒక సాఫ్ట్‌వేర్ మేనేజర్ ఉన్నాడనుకుందాం. అతనికి అంతా ఉంది, కానీ ప్రశాంతత లేదు. రిటైర్మెంట్ తీసుకున్నాక వరల్డ్ టూర్ వెళ్తాను, అప్పుడు నా గార్డెనింగ్ హాబీని చూసుకుంటాను అని చెప్తుంటాడు. కానీ 60 ఏళ్ల వయసులో అతని ఆరోగ్యం ప్రయాణాలకు సహకరిస్తుందా? అప్పటికి అతనిలో ఇప్పుకున్నంత ఎనర్జీ ఉంటుందా? అంటే సమాధానం లేదు. ప్రస్తుతం తన చేతిలో ఉన్న అద్భుతమైన కాలాన్ని, రిటైర్మెంట్ తర్వాత రాబోయే అనిశ్చిత కాలం కోసం బలి ఇస్తున్నాడు. అలాగే చాలా మంది పేరెంట్స్ తమ కలలను చంపేసుకుని పిల్లలే నా సర్వస్వం అంటారు. పిల్లలు సెటిల్ అయి అమెరికాకో, మరో ఊరికో వెళ్లిపోయాక, వీరికి మిగిలేది ఒక పెద్ద శూన్యం మాత్రమే. తమకంటూ ఒక సంతోష ప్రపంచాన్ని నిర్మించుకోకపోవడం వల్ల ఆ వయసులో ఒంటరితనం మరింత వేధిస్తుంది. మనం మన ఆలోచనా ధోరణిని మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ క్రింది మార్గాల ద్వారా వర్తమానంలో జీవించడం నేర్చుకోవచ్చు, ముందుగా సంతోషం అనేది ఎక్కడో దొరికే నిధి కాదని, అది మన ప్రయాణంలో ప్రతి అడుగులో ఉండే అనుభూతి అని గుర్తించాలి. ఉదయాన్నే వేడి కాఫీ తాగుతున్నప్పుడు కలిగే హాయి, వర్షం పడుతున్నప్పుడు వచ్చే మట్టి వాసన, చిన్న పిల్లల నవ్వు, ఇవన్నీ సంతోషాలే. వీటిని ఆస్వాదించడం అలవాటు చేసుకోవాలి. ఇప్పుడు, ఈ క్షణం మీరు ఏం చేస్తున్నారో దానిపై పూర్తి శ్రద్ధ పెట్టండి. భోజనం చేస్తుంటే ఆ రుచిని ఆస్వాదించండి, నడుస్తుంటే ఆ గాలిని స్పర్శించండి. గతాన్ని తవ్వుకోకుండా, భవిష్యత్తు గురించి భయపడకుండా ఇక్కడ, ఇప్పుడు ఉండటమే గొప్ప మెడిటేషన్. కేవలం పెద్ద గోల్స్ సాధించినప్పుడే కాదు, చిన్న చిన్న పనులు పూర్తి చేసినప్పుడు కూడా మీకు మీరు ట్రీట్ ఇచ్చుకోండి. ఆ చిన్న సెలబ్రేషన్ మీలో పాజిటివ్ ఎనర్జీని నింపుతుంది. లేని వాటి కోసం ఏడవడం కంటే, ఉన్న వాటి కోసం కృతజ్ఞతతో ఉండటం నేర్చుకోవాలి. ప్రతి రోజూ పడుకునే ముందు మీకు ఆ రోజు జరిగిన ఐదు మంచి విషయాలను గుర్తు చేసుకోండి. ఇది మీ మెదడును సంతోషం వైపు ట్యూన్ చేస్తుంది. మీ ప్రాధాన్యతల్లో మీ మనసుకి నచ్చిన పనులను కూడా చేర్చండి. పుస్తక పఠనం, సంగీతం, పెయింటింగ్ లేదా లాంగ్ డ్రైవ్, వారంలో కనీసం కొన్ని గంటలైనా మీ కోసమే కేటాయించండి. తర్వాత చేద్దాం అనే మాటను డిక్షనరీ నుండి తీసేయండి. దీని అర్థం భవిష్యత్తు గురించి ప్లాన్ చేసుకోకూడదని కాదు. బాధ్యతలు వదిలేయమని కాదు. కానీ బ్యాలెన్స్ ముఖ్యం. రేపటి కోసం పొదుపు చేయండి, కానీ ఇవాళ ఆకలితో ఉండకండి. రేపటి విజయం కోసం కష్టపడండి, కానీ ఆ కష్టంలో కూడా ఇష్టాన్ని వెతుక్కోండి. జీవితం చాలా అనిశ్చితమైనది. మరుక్షణం ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. అందుకే, రేపు ఎప్పుడో వచ్చే సంతోషం కోసం నేటి క్షణాలను సమాధి చేయకండి. మీ ప్రియమైన వారితో గడపండి, ఇష్టమైన ఆహారం తినండి, మనసారా నవ్వుకోండి. సంతోషం అనేది మనం వెతుక్కునే గమ్యం కాదు, అది మనం ఎంచుకునే నిర్ణయం. గుర్తుంచుకోండి మీ దగ్గర నిజంగా ఉన్నది, మీరు అనుభవించగలిగింది కేవలం ఈ క్షణం మాత్రమే. కాబట్టి, సంతోషాన్ని వాయిదా వేయకండి.. ఇప్పుడే, ఇక్కడే సంతోషంగా ఉండండి!

ఎల్పీజీ గ్యాస్ కృత్రిమ కొరత

- ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్న ప్రజలు
- రీఫిల్ గడువు 21 నుండి 25 రోజులకు పెంచిన ప్రభుత్వం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 9: ఇరాన్‌లో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్) సహా అనేక పట్టణాలు, నగరాల్లోని ఎల్పీజీ ఏజెన్సీల బయట ఒత్తిడి కనిపిస్తున్నది. నోయిడాలోని సెక్టార్ 22లో ఓ భారత్ గ్యాస్ ఏజెన్సీ వెలుపల సోమవారం ఖాళీ సిలిండర్లు పట్టుకుని పెద్ద సంఖ్యలో ప్రజలు బారులు తీరి నిలబడి ఉదయం కనిపించారు. అదే విధంగా ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలోని బర్ధపూర్ గ్రామంలో ఓ గ్యాస్ ఏజెన్సీ బయట వందలాది మంది ప్రజలు ఖాళీ సిలిండర్లతో నిలుచున్న దృశ్యాల వీడియో సోషల్ మీడియాలో మార్చి 7న వైరల్ అయింది. ఎల్‌పీజీ సిలిండర్ల కోసం కొన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు గ్యాస్ ఏజెన్సీల వెలుపల బారులుతీరి నిలబడుతున్నట్లు వార్తలు వస్తుండగా.. దేశంలో ఎక్కడా ఎల్పీజీ సంక్షోభం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇరాన్ యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు వస్తున్న వార్తలతో ప్రజల్లో ఏర్పడిన భయాందోళనలను సొమ్ము చేసుకునేందుకు కొందరు గ్యాస్ సరఫరాదారులు కృత్రిమ కొరతను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. గ్యాస్ ఏజెన్సీలో స్టాక్ లేకపోవడంతో బ్లాక్ మార్కెట్ లో రూ. 1,500 ఇచ్చి ఎల్పీజీ సిలిండర్ కొనవలసి వచ్చిందని ఉత్తరప్రదేశ్‌లోని ఓ చిన్న పట్టణానికి చెందిన మహిళ ఒకరు తెలిపారు. రంజాన్ మాసం కావడంతో ఎల్పీజీ అత్యవసరమని ప్రతాప్‌గఢ్ జిల్లాకు చెందిన ఆ గృహిణి చెప్పారు. గత నాలుగైదు రోజులుగా ప్రజలు భయాందోళనలతో ఎల్పీజీని కొనుగోలు చేస్తున్నట్లు దక్షిణ ఢిల్లీలోని ఇండేన్ గ్యాస్‌కు చెందిన సిలిండర్ డెలివరీ ఉద్యోగి ఒకరు చెప్పారు. గతవారం ఎల్పీజీ సిలిండర్ ధరను పెంచిన కేంద్రం సిలిండర్ రీబుకింగ్ నిబంధనలను కఠినతరం చేసింది. ఎల్పీజీ సిలిండర్లపై ఆంక్షలు పెంచిన దరిమిలా హైదరాబాద్, రాంచి, కోల్‌కతా, గోవా తదితర నగరాల్లో కూడా ఎల్పీజీ కోసం ప్రజలు బారులుతీరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై
త్వరలోనే దర్యాప్తు పూర్తి

- విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 9: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనపై విచారణ వేగంగా కొనసాగుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) జరుపుతున్న దర్యాప్తు ప్రమాదం జరిగిన ఏడాది లోపే పూర్తిస్థాయి విచారణ నివేదిక అందుతుందని దీమా వ్యక్తం చేశారు. రాజ్యసభలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో శివసేన సభ్యుడు మిలింద్ దేవరా అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ప్రమాద దర్యాప్తుతో పాటు పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల వేళ భారత ప్రయాణికులకు అందిస్తున్న సౌకర్యాలపై కూడా కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు. పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతల దృష్ట్యా భారతీయ ప్రయాణికుల భద్రతపై సభలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, విమానయాన శాఖ పరిస్థితులను నిశితంగా గమనిస్తోందని చెప్పారు. గడిచిన వారంలోనే సుమారు 90,000 మంది భారతీయులు గల్ఫ్ దేశాల నుంచి సురక్షితంగా ప్రయాణించినట్లు మంత్రి తెలిపారు. విమానయాన సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రయాణికుల ప్రాణాలే తమకు ముఖ్యమని, భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు.

చీఫ్ ఎలక్షన్ కమిషన్ పై అభిశంసన!

- తీర్మానానికి సిద్ధమవుతున్నన విపక్షాలు

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 9: చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తొలగింపునకు పార్లమెంట్ లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ తీర్మానానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని, ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశముందని తెలిసింది. ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా, ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాయని టీఎంసీ సీనియర్ ఎంపీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానం ముసాయిదా సిద్ధమైందని అన్నారు. ఒకేసారి రెండు సభల్లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎన్నికల కమిషనర్ తన పదవిని పూర్తిగా దుర్వినియోగం చేశారని ఆ నాయకుడు ఆరోపించారు. ఇండియా కూటమిలోని ఇతర పార్టీలన్నీ ఈ అభిశంసన తీర్మానానికి అనుకూలంగా ఉన్నాయని, ముసాయిదా రూపకల్పనలో భాగస్వామ్యమైనాయని తెలిసింది. తీర్మానంపై అన్ని పార్టీల నాయకులు ఎంపీల సంతకాలను సేకరించనున్నారు. లోక్‌సభ నుంచి కనీసం 100, రాజ్యసభ నుంచి కనీసం 50 మంది సంతకాలు అవసరమని ఓ నాయకుడు తెలిపారు. పార్లమెంట్ ద్వారా హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించేందుకు అనుసరించే విధానమే సీఈసీ తొలగింపునకు కూడా వర్తిస్తుందని అన్నారు.

స్విస్ ఓపెన్ నుంచి సింధు ఔట్

ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆడలేకపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కీలక నిర్ణయం తీసుకుంది. తీవ్ర భయాందోళన మధ్య దుబాయ్ నుంచి స్వదేశం వచ్చిన సింధు.. స్విస్ ఓపెన్‌లోనూ ఆడకూడదని తీర్మానించుకుంది. మూడు రోజుల దుబాయ్‌లో బిక్కుబిక్కుమంటూ గడిపిన తను.. మానసికంగా, శారీరకంగా సన్నద్ధంగా లేనందునే స్విస్ ఓపెన్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దుబాయ్‌లో చిక్కుకున్న పీవీ సింధు ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు దూరమైంది. మూడు రోజుల తర్వాత స్వదేశం చేరుకున్న తెలుగు తేజం ఇంకా కుదురుకోలేదు. దాంతో.. వెంటనే కోర్టులోకి దిగేందుకు ఆమె సిద్ధంగా లేదు. సో.. స్విట్జర్‌లాండ్ ఓపెన్ టోర్నమెంట్ నుంచి వైదొలగాలని సింధు నిర్ణయించుకుంది. రెండోసారి కూడా ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో కంగుతిన్న లక్ష్య సేన్ సైతం ఈ పోటీల్లో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. మార్చి 10 నుంచి మొదలయ్యే ఈ ఈవెంట్‌కు తాను అందుబాటులో ఉండదని ఆమె తెలిపింది. స్విట్జర్‌లాండ్‌లోని సెయింట్ జకొబ్‌షల్లేలో మార్చి 10వ తేదీ నుంచి మార్చి 15 వరకూ స్విస్ ఓపెన్ జరుగనుంది.

సచిన్ సలహాలతో నా కల నిజం

ఐసీసీ ఈవెంట్లో ఒక్క మ్యాచ్‌లో జట్టును గెలిపిస్తేనే అది గొప్ప విషయం. అలాంటిది ఏకంగా సూపర్ 8, సెమీ ఫైనల్.. ఫైనల్లోనూ విధ్వంసక అర్ధ శతకాలతో భారత జట్టు విజయాల్లో కీలకమయ్యాడు సంజూ శాంసన్ . సన్నాహక సిరీస్‌లో న్యూజిలాండ్‌పై ఘోరంగా విఫలమైన సంజూ.. నాకౌట్ మ్యాచ్‌లో టీమిండియాకు పెద్ద దిక్కులా మారడానికి కారణం సచిన్ టెండూల్కర్. ఈ విషయాన్ని ఫైనల్ అనంతరం ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు ప్రదానం సమయంలో ఈ చిచ్చరపిడుగే స్వయంగా చెప్పాడు. పొట్టి ప్రపంచకప్‌ను నిలబెట్టుకున్న భారత జట్టు మూడో ట్రోఫీతో చరిత్ర సృష్టించింది. స్వదేశంలో ఫేవరెట్‌గా అడుగు పెట్టి.. సంచలన ఆటతో ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా విజయంలో సంజూ శాంసన్ పాత్రను ఎంత కొనియాడినా తక్కువే. నిరుడు అక్టోబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనలో బెంచ్‌కే పరిమితమైన ఈ పవర్ హిట్టర్.. హ్యాట్రిక్ హాఫ్ సెంచరీలతో జట్టుకు కొండంత అండగా మారాడు. పొట్టి క్రికెట్‌లో అనుభవానికి కొదవలేకున్నా.. నిలకడలేమితో విమర్శలపాలైన సంజూ ఇప్పుడు గెలుపు గుర్రంగా అవతరించాడు. మూడు అర్ధ శతకాలతో కలిపి 261 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు అందుకున్న తనలో ఇంతటి భారీ మార్పులకు కారణం సచిన్ టెండూల్కర్ అని చెబుతున్నాడు శాంసన్.

శ్రీలంక కోచ్‌గా గ్యారీ కిర్‌స్టెన్

పొట్టి ప్రపంచకప్‌లో సూపర్ 8 దశలోనే నిష్క్రమించిన శ్రీలంక వన్డే ప్రపంచకప్‌పై గురి పెట్టింది. స్వదేశంలో చెత్త ఆటతో నిరాశపరిచిన లంకను గాడీలో పెట్టేందుకు గ్యారీ కిర్ స్టన్ ను ఆశ్రయించింది ఆ దేశ బోర్డు. అనుభవజ్ఞుడైన ఈ దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడిని రెండేళ్ల కాలానికి ప్రధాన కోచ్‌గా నియమించింది శ్రీలంక క్రికెట్. సనత్ జయసూర్య స్థానాన్ని కిర్‌స్టెన్ భర్తీ చేయనున్నాడు. సుదీర్ఘ అనుభవమున్న గ్యారీ ఏప్రిల్ నుంచి లంక కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. రెండేళ్ల క్రితం టీ20 ప్రపంచకప్ వైఫల్యాన్ని సొంతగడ్డపై కొనసాగించిన శ్రీలంక సూపర్ 8లోనే ఇంటిదారి పట్టింది. వరల్డ్‌కప్ హీరో, మాజీ ఆటగాడు సనత్ జయసూర్య కోచింగ్‌లో ఏడాది కాలంగా గొప్పగా ఆడిన లంక.. వరల్డ్‌కప్‌లో మాత్రం తేలిపోయింది. స్వదేశంలోనూ చతికిలపడిన లంకకు కోచ్‌గా ఉండలేనని జయసూర్య వైదిలిగాడు. అతడి రాజీనామాతో కొత్త కోచ్ వేటను మొదలెట్టిన శ్రీలంక క్రికెట్ అనుభవజ్ఞుడైన గ్యారీ కిర్‌స్టెన్‌ను తదుపరి కోచ్‌గా నియమించింది. రెండేళ్ల కాంట్రాక్ట్‌లో భాగంగా ఏప్రిల్ 15వ తేదీ నుంచి అతడు కోచ్‌గా సేవలందించనున్నాడు. ఆటగాడిగా విజయవంతమైన కిర్‌స్టెన్ కోచ్‌గానూ గొప్పగా రాణించాడు. 2011లో భారత జట్టు వన్డే వరల్డ్‌కప్ విజయంతో కీలకమైన గ్యారీ.. ఆపై ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టును అరంగేట్రంలోనే ఛాంపియన్‌గా నిలిపాడు. అనంతరం పాకిస్థాన్ జట్టుకు కొన్ని రోజులు కోచ్‌గా సేవలందించిన అతడు.. పొట్టి వరల్డ్‌కప్‌లో నమీబియా జట్టుకు కన్సల్టెంట్‌గా పని చేశాడు. వచ్చే ఏడాది వరల్డ్‌కప్ పోటీలకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయంగా 101 టెస్టులు, 185 వన్డేల్లో దక్షిణాఫ్రికాకు కిర్‌స్టెన్ ప్రాతినిధ్యం వహించాడు.

టీమ్‌ఇండియా భారీ ఓటమి

- మహిళల ఏకైక టెస్టు ఆసీస్ కైవసం

ఆస్ట్రేలియాతో ఏకైక టెస్టులో భారత మహిళల జట్టు భారీ ఓటమి చవిచూసింది. మూడు రోజుల్లో ముగిసిన గులాబీ బంతితో డే అండ్ నైట్ టెస్టు పోరులో ఆసీస్ 10 వికెట్ల తేడాతో టీమ్‌ఇండియాపై ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 25 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని వికెట్ కోల్పోకుండా 4.3 ఓవర్లలో విజయాన్నందుకుంది. ఓపెనర్లు జార్జియా వోల్(16 నాటౌట్), లిచ్‌ఫీల్డ్(11 నాటౌట్) అజేయంగా నిలిచారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 105/6 ఆదివారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన టీమ్‌ఇండియా 149 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ ప్రతీకా రావల్(137 బంతుల్లో 63, 3ఫోర్లు) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, మిగతావారు ఘోరంగా విఫలమయ్యారు. లూసీ హామిల్టన్ సదర్లాండ్ కింగ్ గార్డ్‌నర్(2/8) రెండేసి వికెట్లు తీశారు. లోయార్డర్‌లో స్నేహ్‌రానా(30)..ప్రతీకకు మెరుగైన సహకారం అందించింది. ఆసీస్ దిగ్గజం అలీసా హిలీ తన టెస్ట్ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మ్యాచ్ విజయంలో కీలకమైన సదర్లాండ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు సిరీస్ దక్కింది.

మధుబాల బయోపిక్

భారతీయ చలనచిత్ర చరిత్రలో 'వీనస్ ఆఫ్ ఇండియన్ సినిమా'గా పేరుగాంచిన దివంగత కథానాయిక మధుబాల జీవిత కథను వెండితెరపై ఆవిష్కరించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా ఈ భారీ ప్రాజెక్టుకు కళాత్మక చిత్రాల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ చిత్రంలో మధుబాల పాత్రలో నటించే అవకాశం సౌత్ నార్త్ ప్రేక్షకులకు సుపరిచితమైన కియారా అద్వానీకి దక్కిందని ప్రచారం సాగుతోంది. మొదట పలువురు అగ్ర తారల పేర్లు వినిపించినప్పటికీ చివరకు కియారాను ఫైనల్ చేశారని సోషల్ మీడియాలో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. భన్సాలీ టీమ్ కానీ, కియారా అద్వానీ కానీ దీనిని ధృవీకరించలేదు. అసలు ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం ఏ దశలో ఉంది? స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందా లేదా అనే విషయాలపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. మొఘల్‌ఎఆజం, చల్తీ కా నామ్ గాడి వంటి క్లాసిక్ చిత్రాలతో భారతీయ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మధుబాల పాత్రను పోషించడం కియారాకు ఒక గొప్ప సవాలుతో కూడుకున్న విషయమే.

మార్చి 13 నుండి ZEE5 లో

'భర్త మహాశయులకు విజ్ఞప్తి'

మాస్ మహారాజ్ రవితేజ నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ సినిమాలో రవితేజ, ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి ప్రధాన పాత్రలు పోషించారు. కావాల్సినంత కామెడీ, గుండెల్ని తాకే ఎమోషన్స్‌ను మిళితం చేసి ఈ కథను కిషోర్ తిరుమల తెరపైకి తీసుకు వచ్చారు. సంక్రాంతి బరిలోకి దిగిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్‌కు రెడీగా ఉంది. మార్చి 13 నుంచి ఈ మూవీ జీ5 తెలుగులో స్ట్రీమింగ్ కాబోతోంది. దక్షిణాది భాషల్లో ఈ మూవీ డబ్బింగ్ రూపంలో అందుబాటులో ఉంటుంది. ఈ సినిమా డిజిటల్ రిలీజ్ గురించి మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ ..'ఈ సినిమాలో హాస్యం తో నిండిన ప్రత్యేకమైన భావోద్వేగం ఉంటుంది. కిషోర్ తిరుమల దీనిని వినోదాత్మకంగా, అందరికీ నచ్చే విధంగా తెరకెక్కించారు. దక్షిణాది ప్రాంతాల ప్రేక్షకులు దీనిని వారి స్వంత భాషలో ఎక్స్‌పీరియెన్స్ చేసేలా జీ5లోకి వస్తున్నందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను' అని అన్నారు. కుటుంబ సమేతంగా అందరూ కలిసి చూడదగ్గ ఈ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' మార్చి 13న ZEE5లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

'లేచింది మహిళాలోకం' ట్రైలర్ లాంచ్

బ్రిహస్పతి ఎంటర్‌టైన్‌మెంట్స్, అప్పారెంట్లీ సినిమా, స్టోరీ ఫ్యాక్టరీ బ్యానర్స్‌పై హైమ రాజశేఖర్, శ్వేత మహి, నిరోష నవీన్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'లేచింది మహిళాలోకం'. దర్శకద్వయం అర్జున్‌కార్తిక్ రూపొందించిన ఈ చిత్రంలో మంచు లక్ష్మి, శ్రీరామ చంద్ర, అనన్య నాగళ్ల, హరితేజ, హేమ, సుప్రిత, శ్రద్ధాదాస్ ప్రధాన పాత్రలు పోషించారు. కొత్తగా పెళ్లయిన ఒక జంట మధ్య చిన్న చిన్న విషయాలకే విభేధాలు రావడం.. వాటికి ఆజ్యం పోసేలా పక్కింటివాళ్లు తమ మాటలతో పొల్యూట్ చేయడం.. ఈ క్రమంలో జరిగే పరిణామాలు ఒకవైపు థ్రిల్‌కు గురి చేస్తూనే మరోవైపు కడుపుబ్బా నవ్వించేలా ఈ సినిమాను తీర్చిదిద్దారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం మార్చి 26న థియేటర్లల్లో విడుదలకు సిద్ధమవుతోంది. సన్‌స్టూడియో యూఎఫ్ఓతో కలిసి ఈ సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా మూవీ టీమ్ సోమవారం ప్రసాద్ ల్యాబ్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించింది.

హృదయాలను తాకుతున్న

'సంచారమే..'

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' సినిమా నుంచి తొలి గీతంగా 'సంచారమే'ను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది. ఈ మనోహరమైన పాట ప్రధాన పాత్రల భావోద్వేగ ప్రయాణాన్ని ఎంతో అందంగా ఆవిష్కరించింది. ప్రఖ్యాత గీత రచయిత గోరేటి వెంకన్న రచించిన ఈ పాట స్వచ్ఛమైన తెలుగు కవిత్వంతో పాటు హృదయాన్ని తాకే భావాలతో ప్రత్యేకంగా నిలుస్తోంది. దేశీ మూలాలు, విదేశీ జీవితానికి మధ్య ఉన్న విరుద్ధ భావాలను సున్నితంగా ప్రతిబింబిస్తూ సినిమా కథనానికి అనుగుణంగా ఈ పాట సాగుతుంది. ఈ గీతానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ అద్భుతమైన సంగీతాన్ని సమకూర్చారు. ఆ కూర్పుకు మరింత గాఢతను జోడిస్తూ హేషమ్ అబ్దుల్ వహాబ్, గోరేటి వెంకన్న కలిసి శ్రావ్యంగా పాటను ఆలపించారు. దృశ్యపరంగా ఈ పాట లండన్ యొక్క అద్భుతమైన దృశ్యాలను ప్రదర్శిస్తుంది. అంతర్జాతీయ ప్రకృతి దృశ్యాలను, తెలుగు స్వరాల మాధుర్యాన్ని మిళితం చేస్తూ ఎంతో ఆకర్షణీయంగా ఈ గీతముంది. బ్లాక్‌బస్టర్ "బేబీ" తర్వాత మళ్లీ కలిసి నటిస్తున్న ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జోడి తెరపై ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



'జెట్లీ' షూటింగ్ పూర్తి

టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్స్ పోస్టర్స్, గ్లింప్స్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన స్పెషల్ వీడియోలో సత్య ఫన్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. మత్తు వదలరా వెనుక ఉన్న మెయిన్ టీం ఈ సినిమాకు పని చేస్తున్నారు. మ్యూజిక్ కాలభైరవ, సినిమాటోగ్రాఫర్ సురేష్ సారంగం, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్ నార్ని శ్రీనివాస్ తో కలిసి రితేష్ రానా మరోసారి యూనిక్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేశారు. రితేష్ రాణా స్టైల్, సిగ్నేచర్ హ్యూమర్‌తో పాటు హైఎనర్జీ యాక్షన్ మేళవించిన జెట్లీ ఫన్‌ప్యాక్డ్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200